Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 96 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 ఏప్రిల్ 2023 శుక్రవారం పేజీలు : 4

### పూంఛ్‌లో ఉగ్రదాడి తర్వాత పాక్‌లో అలజడి

న్యూఢిల్లీ, ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో ఈ నెల 20న రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ జవాన్లు ప్రయాణిస్తున్న ట్రక్కుపై లష్కర్ ఎ తొయిబా అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్ దాడి జరిపిన నాటి నుంచి పాకిస్థాన్ భయంతో వ ణికిపోతోం ది. భారత్ మరోసారి సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. ఇప్పటికే భారత్ తమ గగనతలంలోకి జొచ్చుకువచ్చిందని పాక్ సైన్యం వెల్లడించింది. పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో జరపకపోవచ్చని భారత్‌లో పాక్ మాజీ హై కమిషనర్ అబ్దుల్ బాసిత్ చెప్పారు. ఓ పక్క షాంఘై సహకార సంస్థకు, మరో పక్క జీ20 దేశాలకు భారత్ ప్రస్తుతం అధ్యక్షత వహిస్తున్న తరుణంలో పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు జరపకపోవచ్చని బాసిత్ అంచనా వేస్తున్నారు.




# హ్యాట్రిక్ సాధించి తీరుతాం

## భరోసా ఆవిర్భావ వేడుకల్లో సీఎం కేసీఆర్

## తెలంగాణ భవన్‌లో ఘనంగా భారాస ఆవిర్భావ వేడుకలు..

హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (భారాస) ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. భారాస (తెరాస) ఆవిర్భవించి నేటికి 22 వసంతాలు పూర్తి చేసుకొని 23వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో భారాస జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి ఆయన పూలమాలలు వేశారు. అనంతరం కేసీఆర్ అధ్యక్షతన పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇది తెరాస నుంచి భారాసగా మార్పు తర్వాత జరుగుతున్న తొలి సర్వసభ్య సమావేశం కావడం గమనార్హం. ఈ భేటీకి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ ఛైర్మన్లు, డీసీసీబీ ఛైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు.. ఇలా మొత్తం 279 మంది హాజరయ్యారు. తెలంగాణ భవన్‌లో సాయంత్రం వరకు ప్రతినిధులు చర్చలు జరిపారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలే లక్ష్యంగా కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. అక్టోబరు 10న వరంగల్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభపైనా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలతో ఎన్నికలకు సిద్ధమవుతోన్న భారాస.. త్వరలోనే విద్యార్థి, యువజన సమ్మేళనాల నిర్వహణకు సన్నద్ధం అవుతోంది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ మళ్ళీ మనమే అధికారంలోకి వస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలు, కనుమరుగవ్వనున్న పార్టీలు మనల్నేమీ చేయలేవని, తెలంగాణ ప్రజలు మనకే మద్దతుగా నిలుస్తారని, హ్యాట్రిక్ విజయం సాధించి తీరుతామని ప్రతినిధుల ముందు కేసీఆర్ ధీమా వ్యక్త పరిచినట్లు తెలుస్తోంది.

**తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన నేత కేసీఆర్: కేటీఆర్ :** తెలంగాణ ప్రజలకు మంత్రి కేటీఆర్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. "రెండు దశాబ్దాల క్రితం ఉద్యమ పార్టీకి పురుడు పోసి.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని పునఃప్రతిష్ఠించి అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన నేత మన కేసీఆర్. 22 ఏళ్ల ప్రస్థానంలో నాటి నుంచి నేటి వరకు భారత్ రాష్ట్ర సమితికి అండగా ఉంటున్న పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

**దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ: హరీశ్‌రావు :** "స్వరాష్ట్ర సాధన కోసం నాడు తెరాస.. ఉజ్వల భారత్ కోసం నేడు భారాస.. అధినేత కేసీఆర్ సారథ్యంలో 22ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఉద్యమ పార్టీ, స్వరాష్ట్ర గమ్యాన్ని ముద్దాడి నేటి బంగారు తెలంగాణకు బాటలు వేసింది. అనతి కాలంలోనే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పార్టీగా నిలుస్తూ.. దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాంది పలికింది. 9 ఏళ్లలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్, తెలంగాణ అభివృద్ధి మోడల్‌ను దేశవ్యాప్తం చేసేందుకు బయలుదేరారు" అని హరీశ్‌రావు ట్వీట్‌లో పేర్కొన్నారు.




## సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కీలక సమావేశంలో కేసీఆర్ సీరియస్ వార్నింగ్

హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకున్నారు.

**సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ సీరియస్ వార్నింగ్** : కాగా ఎన్నికలపై సీఎం కేసీఆర్ నేతలను ఉద్దేశించి మాట్లాడారు.. షెడ్యూల్ ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పనిచేసుకోవాలన్నారు. లేకపోతే నష్టపోతారని, సరిగ్గా పనిచేయని ఎమ్మెల్యేల తోకలు కట్ చేస్తానని హెచ్చరించారు. కాగా ముందుగా కే కేశవరావు ప్రసంగంతో సమావేశం ప్రారంభమ్యోం ది. అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగించారు. తర్వాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటిఆర్ తీర్మానాలను ప్రవేశ పెట్టారు.

# మహారాష్ట్రలో కేసీఆర్ ప్రభావమెంత?

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత జాతీయ రాజకీయాల్లో పాగా వేసేందుకు దూకుడు పెంచారు. ఇతర రాష్ట్రాల్లో అవకాశం ఉన్న ప్రతీ సారి పర్యటనలు సాగిస్తున్న ఆయన మహారాష్ట్రపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ రాష్ట్రంలోని రైతు సంఘాలు ఇతరులు కేసీఆర్ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ లో చేరేందుకు తరలి వస్తున్నారు.

ఇప్పటికే కొందరు హైదరాబాద్ వచ్చి గులాబీ కండువాలు కప్పుకోగా మరికొందరు అక్కడ నిర్వహించే సభల్లో పార్టీలో చేరుతున్నారు. మహారాష్ట్రలో ఇప్పటివరకు కేసీఆర్ నాందేడ్ కాందార్ లో సభలు నిర్వహించారు. తాజాగా ఔరంగాబాద్ లోని జబిందా గ్రౌండ్ లో నిర్వహించిన సభకు లక్షలాది మంది ప్రజలు తరలి వచ్చారు. దీంతో మహారాష్ట్రలో పాగా వేయడం పెద్దగా కష్టం కాదని బీఆర్ఎస్ నాయకులు చర్చించుకుంటున్నారు. ఉత్తర తెలంగాణకు ఆనుకొని ఉన్న మహారాష్ట్ర సరిహద్దుల్లో వ్యవసాయదారులు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా విదర్భ ప్రాంతాన్ని బేస్ చేసుకున్న ఆయన ఆ ప్రాంతంలోనే సభలు నిర్వహించడం విశేషం. గతంలో నాందేడ్ సభకు ప్రజలు ఎక్కువగా కనిపించకపోయినా తాజాగా ఔరంగాబాద్ లో నిర్వహించిన సభల్లో జనం బాగా వచ్చారు.



అయితే వీరంతా మహారాష్ట్రకు చెందినవారా? లేక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్ నిజామాబాద్ నుంచి తీసుకెళ్లారా? అని చర్చించుకుంటున్నారు. గతంలో నాందేడ్ సభ నిర్వహణ కోసం ఈ రెండు జిల్లాల నాయకులను కేసీఆర్ అప్రమత్తం చేశారు. కానీ అప్పుడు సక్సెస్ కాలేకపోయారు. తాజాగా జన ప్రవాహం కనిపించడంతో గులాబీ బాస్ ఖుషీ అయినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం అనిశ్చితి నెలకొంది. మొన్నటి వరకు కాంగ్రెస్ మద్దతుతో కొనసాగిన శివసేన నుంచి కొందరు బీజేపీలో చేరారు. అయితే పూర్తిగా బీజేపీ కాకపోయిన ఆ పార్టీ మద్దతుతోనే ప్రభుత్వం కొనసాగుతోంది. అయితే మళ్లీ రాజకీయ సంక్షోభం నెలకొన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి ఇదే మంచి అవకాశం అని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే కొద్ది కాలంలోనే ఇక్కడ మూడు సభలు నిర్వహించారు. అందుకు అనుగుణంగానే ఇక్కడి వారు మిగతా పార్టీలను కాదని బీఆర్ఎస్ లో చేరుతున్నారు. తెలంగాణ తరువాత ఏపీకి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రంలో కేసీఆర్ పర్యటించలేదు. కానీ మహారాష్ట్రలో పదే పదే సభలు నిర్వహించడం పై ఈ రాష్ట్రంపై పాగా వేస్తే మిగతా రాష్ట్రాలో దూసుకుపోవచ్చని ఆలోచిస్తున్నారు. అంతేకాకుండి ఇక్కడి విదర్భం ప్రాంతం ఒకప్పుడు తెలంగాణతో కలిసి ఉండడం వల్ల ఆ సెంటిమెంట్ ను బయటకు తీస్తున్నారు. మనమంతా ఒక్కటే అన్న భావనతో కేసీఆర్ తన ప్రసంగంతో మహారాష్ట్ర ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఇక రైతుబంధు రైతుబీమా వంటి పథకాలతో ఆకట్టుకున్న ఆయన తమ ప్రభుత్వం వస్తే ఈ పథకాలను అమలు చేస్తామని హామీ ఇస్తున్నారు.

# కొత్త సచివాలయం ఓపెనింగ్‌కు

# డేటు - టైము డిసైడ్!



## ఆదివారం మధ్యాహ్నం 1.10 - 1-20 మధ్య

## తెర మీదకు 'ఆరు' సెంటిమెంట్

హైదరాబాద్ : తాను అనుకున్నది చేసే వరకు నిద్ర పోని లక్షణం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సొంతం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని సొంతం చేసుకున్న కేసీఆర్.. సచివాలయంలో ఆయనకు ఏదో అనిపించటం.. అప్పటి నుంచి సచివాలయానికి వెళ్లకుండా ఉ ండటం తెలిసిందే. పాత దాని స్థానంలో కొత్త సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని అనుకోవటం.. అందుకు తగ్గట్లే వందల కోట్ల ఖర్చుతో భారీగా నిర్మించిన సచివాలయం సిద్ధమైంది.

ఆదివారం (ఏప్రిల్ 30న) మధ్యాహ్న వేళ సచివాలయాన్ని ఓపెన్ చేసేందుకు ముహుర్తాన్ని డిసైడ్ చేశారు. కొత్త సచివాలయాన్ని ప్రారంభించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం.. దానికి సంబంధించిన వివరాల్ని తాజాగా వెల్లడించింది. ఆదివారం మధ్యాహ్నం 1.58 గంటల నుంచి 2.04 గంటల మధ్యలో అన్ని శాఖలకు చెందిన అధికారులు తమ కుర్చీల్లో కూర్చోవటంతో పాటు.. ప్రతి ఒక్కరు కనీసం ఒక్క ఫైలు మీదనైనా సరే సంతకం చేసేలా సిద్ధం కావాలని పేర్కొనటం గమనార్హం.

1.58 గంటల నుంచి 2.04 గంటల మధ్య ఉండే ఆరు నిమిషాల వ్యవధిలోనే ఉద్యోగులు తమ ఫైళ్ల మీద సంతకాలు పెట్టాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కు 'ఆరు' కు ఉన్న లంకె గురించి అందరికీ తెలిసిందే. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచే సచివాలయ ప్రారంభోత్సవ పూజలు.. హోమాలు సాగనున్నాయి. ఈ పూజల్లో మంత్రి ప్రశాంత్ రెడ్డితో పాటు అధికారులు హాజరు కానున్నారు. సచివాలయ ప్రాంగణంలో చేయబోయే సుదర్శన యాగానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉదయం తొమ్మిది నుంచి పది గంటల మధ్యలో పూజా కార్యక్రమాల్ని పూర్తి చేస్తారని.. మధ్యాహ్నం 1.10 – 1.20 గంటల మధ్యలో సచివాలయాన్ని ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభిస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి తన ఛాంబర్ లో కొలువు తీరిన తర్వాత మంత్రులు.. సీఎంవో కార్యదర్శులతో సహా ఇతర కార్యదర్శులు తమ ఆఫీసుల్లో కూర్చుంటారని చెబుతున్నారు. మే ఒకటి నుంచి కొత్త సచివాలయంలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. బీఆర్కే భవన్ కు ఫైళ్లను తరలించే కార్యక్రమాన్ని షురూ చేసినట్లు చెబుతున్నారు.

కొత్త సచివాలయంలో శాఖల వారీగా కొత్త ఫర్నీచర్ ను ఏర్పాటు చేసి ఉండటంతో.. బీఆర్కే భవన్ నుంచి ఎలాంటి ఫర్నీచర్ ను తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఇదే విషయాన్ని స్పష్టంగా తమ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నెల 29 నాటికి అన్ని శాఖల్లోకి సామాగ్రిని తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

# సంపాదకీయం

## దేశానికి మరో ఉపద్రవం..

### పెరుగుతున్న టొమాటో ఫ్లూ కేసులు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా బాధల నుంచి ఇప్పుడిప్పుడే జనం కోలుకుంటున్నారు. కానీ అంతలోనే మరో మహమ్మారి ముంచుకొస్తోంది. దేశంలోని తమిళనాడులో మొదలైన టొమాటో ఫ్లూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇప్పటివరకు బాధిత రాష్ట్రం తమిళనాడు మాత్రమే అనుకుంటున్న తరుణంలో ఇప్పుడు ఆ లిస్టులో ఒడిశా చేరింది. ఈ రాష్ట్రంలో టొమాటో ఫ్లూ కేసులు రోజు రోజుకు అధికమవుతున్నాయి. కొన్ని రోజులుగా ఇక్కడ కేసులు పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలుపుతోంది. డబ్ల్యూహెచ్వో ప్రకారం ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న వారిలో టొమాటో ఫ్లూ పెరుగుతోందని తెలిపింది. అయితే కరోనా అంత ప్రమాదకరంగా కాకపోయినా పిల్లల రోగనిరోధక శక్తిపై మాత్రం జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. టొమాటో ఫ్లూ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. చిన్నపిల్లలు దగ్గరగా ఉన్నవాళ్లకి తొందరగా అంటుతుంది. చికెన్ ఫాక్స్ స్మాల్ పాక్స్ లాగే ఉన్నా ఇది ప్రత్యేక మైన వ్యాధి. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని పీడియాట్రిక్స్ అండ్ ప్రివెన్షన్ విభాగానికి చెందిన డాక్టర్ అమోల్ కుమార్ లోకాడే టొమాటో ఫ్లూ గురించి వివరించారు. ఈ వైరస్ ఎలా సోకుతుంతో తెలియడం లేదన్నారు. కానీ వచ్చిన వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎందుకంటే ఇది ఐదు సంవత్సరాల లోపు వయసున్న వారిలో ఎక్కువగా వ్యాపిస్తుందని తెలిపారు. కానీ ఫ్లూ సోకిన వెంటనే భయపడాల్సిన అవసరం లేదని అయితే జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమిళనాడు రాష్ట్రంలో వెలుగుచూసిన ఈ కేసులు ఇప్పుడు ఒడిశాలో పెరుగుతున్నాయి. ఆ తరువాత దేశ వ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని అంటున్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఒకవేళ వారికి ఎలాంటి డిసీస్ కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. జ్వరంతో బాధపడుతుంటే సొంతంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలంటున్నారు. మరోవైపు చిన్నారులకు మాత్రమే వచ్చే ఈ ఫ్లూ పై వైద్య పరిశోధనలు జరుగుతున్నాయి. జ్వరపీడితులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. టోమోటో ఫ్లూ వచ్చిందని తెలియనడాకి ముందుగా జ్వరం వస్తుంది. ఆ తరువాత కడుపునొప్పి వాంతులు విరేచనాలు డీ హైడ్రేషన్ ఏర్పడుతుందని డాక్టర్ అమోల్ కుమార్ తెలుపుతున్నారు. ఈ రకమైన లక్షణాలున్న పిల్లలను వేరుగా ఉంచడం మంచిదంటున్నారు. మూడు నుంచి ఐదు రోజుల వరకు జ్వరం కొనసాగితే టొమాటో ఫ్లూ కోసం పరీక్ష చేయించుకోవాలంటున్నారు. శరీరంపై ఎరుపు రంగు దద్దుర్లు కనిపిస్తే టోమాటో ఫ్లూ గుర్తించాలని అంటున్నారు. వీటిలో ద్రవం ఉంటుందని వాటిని ముట్టుకోవడం ద్వారా ఇతరులకు సోకే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇవి పిల్లల శరీరంపై ఏడు నుంచి 14 రోజుల పాటు ఉంటాయని ఆ సమయంలో పిల్లలకు కడుపునొప్పి వాంతులు విరేచనాలు ఉంటాయని వైద్యుడు తెలిపారు.

# రేషన్ డీలర్లకు మొండిచెయ్యి




మంచిర్యాల : రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం కమీషన్ వాటాను చెల్లిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా విడుదల చేయడం లేదు. దీంతో రేషన్ డీలర్లపై భారం పడుతోంది. చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులకు కమీషన్లు పెంచుతూ కేంద్ర ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం క్వింటాలు సరుకులు పంపిణీ చేస్తే డీలర్లకు రూ.70 కమీషన్ రూపంలో చెల్లిస్తున్న కేంద్రం మరో రూ.20 పెంచుతూ రూ.90 ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 423 రేషన్ షాపులు ఉండగా వాటి ద్వారా లబ్ధిదారులకు నెలవారి బియ్యం సరఫరా జరుగుతోంది. జిల్లాలో మొత్తం 2 లక్షల 14వేల236 కార్డులు ఉండగా, కుటుంబంలోని లబ్ధిదారులందరికీ కిలో రూపాయి చొప్పున రేషన్ బియ్యం సరఫరా అవుతున్నాయి. బియ్యం సరఫరా చేసినందుకు డీలర్‌కు కిలోకు రూ.1 చొప్పున లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తోంది. కరోనా కాలంలో లబ్ధిదారులకు తలా ఒక్కంటికి 10కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం డీలర్లకు ప్రత్యేకంగా కమీషన్ అందజేస్తామని ప్రకటించినప్పటికీ అందులో జాప్యం జరుగుతోంది.కమీషన్ చెల్లింపులు ఇలా...రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకులు సరఫరా చేసేందుకు డీలర్‌కు ఇచ్చే కమీషన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 65, 35 శాతాల్లో భరించాలి. ప్రస్తుతం డీలర్‌కు ప్రతి క్వింటాల్‌పై రూ.100 కమీషన్ ఇస్తున్నందున నిర్ణీత వాటా ప్రకారం కేంద్రం రూ.65, రాష్ట్రం రూ.35 చెల్లించాలి. అలా కాకుండా కేంద్రం తన వాటా చెల్లిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా 35 శాతాన్ని డీలరే భరించాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ.70 చెల్లిస్తుండగా డీలర్లు చెల్లించిన వాటాను కలిపి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.100 చొప్పున కమీషన్ చెల్లిస్తోంది. దీనిని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చెల్లిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డీలర్లకు క్వింటాలుపై రూ.90 కమీషన్ పెంచడంతో ఇక మీదట డీలర్ తన వాటా కింద రూ.10 రాష్ట్ర ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. తమ వాటా కింద చెల్లించాల్సిన రూ.10 డీలర్లు భారంగా భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను రూ.90కి పెంచడంతో రాష్ట్ర ప్రభుత్వం మిగతా రూ.10ని కలిపి తమకు కమీషన్ అందజేస్తే బాగుంటదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పాత బకాయిల చెల్లింపులు ఎప్పుడు..?కరోనా కష్టకాలంలో ప్రభుత్వాలు ఉచిత బియ్యం సరఫరా చేయడంతో డీలర్లకు కమీషన్లు ప్రభుత్వాలే చెల్లించాల్సి ఉంది. ఉచిత బియ్యం సరఫరా రాష్ట్రంలో మే నెలతో ముగిసింది. ఫిబ్రవరి వరకే కమీషన్లు అందాయని, మార్చి, ఏప్రిల్ మాసాలకు సంబంధించి కమీషన్లు చెల్లించలేదని డీలర్లు చెబుతున్నారు. ప్రైవేటు బ్యాంకుల్లో ఖాతాలున్న డీలర్లకు జనవరి నుంచి కమీషన్లు రావాల్సి ఉన్నట్లు చెబుతున్నారు. రెండు నెలల కమీషన్లు కేంద్రం నుంచి విడుదలైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఖాతాల్లో జమ చేయడం లేదనే అభిప్రాయాలు డీలర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఎప్పటి కమీషన్లు అప్పుడు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. సరుకుల లేమితో ఇబ్బందులు..చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం మాత్రమే పంపిణీ చేయడంతో కమీషన్లు సరిపోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెలలో 100 క్వింటాళ్లు సరఫరా చేసే డీలర్‌కు రూ. 10వేల కమీషన్ వస్తుంది. ఇందులో గది కిరాయి కనీసం రూ. 2వేలు, గమాస్తాకు రూ. 3వేలు వెచ్చించాలి. మిగతా రూ. 5వేలతోనే డీలరు నెలంతా గడపాల్సి వస్తోంది. బియ్యంతోపాటు చక్కెర, గోధుమలు, పప్పులు తదితర సరుకులు పంపిణీ చేస్తే లాభసాటిగా ఉంటుందని డీలర్లు చెబుతున్నారు. సరుకులు పెంచితే తమ వంతు వాటా కింద క్వింటాలుకు రూ.10 చొప్పున చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తే తమ వాటా రూ.10ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని డీలర్లు అభిప్రాయ పడుతున్నారు. బియ్యం రవాణాలో ఆలస్యంఒక్కో రేషన్ దుకాణానికి గ్రామీణ ప్రాంతాల్లో నెలకు కార్డు లిమిట్ 500 ఉండగా, మున్సిపాలిటీలో 800 నుంచి 1000 కార్డులు ఉంటాయి. 1 నుంచి 15వ తేదీ వరకు షాపులు తెరిచి ఉండాలి. మంచిర్యాల మండలానికి సంబంధించిన ఎంఎల్ఎస్ పాయింట్ నస్పూర్‌లో ఏర్పాటు చేశారు. సరుకు రవాణా ఆలస్యం కావడంతో ఈ నెల బియ్యం పంపిణీ గడువు తేదీని ఈనెల 19కి పెంచారు. ప్రతీ నెల 30వ తేదీ లోపు సరుకులు సరఫరా చేస్తే 1 నుంచి 15 వరకు లబ్ధిదారులకు అందుతాయి. ఈ నెలలో కొన్ని షాపుల్లో 13వ తేదీన సరుకులు చేరాయి. రేషన్ షాపుల్లో ఈ పాస్ విధానంతో లబ్ధిదారులు తనకు తోచిన చోట సరుకులు తీసుకునే వెసలుబాటు ఉంది. కొన్ని షాపులకు సరుకులు సకాలంలో అందడం, మరికొన్నింటికి ఆలస్యం కావడంతో లబ్ధిదారులు సమీపంలోని సరుకులు అందుబాటులో ఉన్న షాపునకు వెళ్లి తీసుకుంటారు. దీంతో ఆలస్యంగా సరుకులు తీసుకున్న డీలర్లు పంపిణీ చేయలేక కమీషన్లకు దూరం అవుతున్నారు. దీనికి తోడు గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా అయ్యే 50 కేజీల బస్తాల్లో 3 నుంచి 4 కిలోల వరకు తరుగు వస్తుందని డీలర్లు చెబుతున్నారు. డీలర్లు ఆవేదన చెందుతున్నారు.

# ఆంక్షలతో అష్టకష్టాలు...

జన్నారం : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల టైగర్ జోన్ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ అడవిపై ఆధారపడ్డ మేదరులు (మహేం ద్రులు), నాయకపోడ్‌ల జీవనోపాధి పూర్తిగా దెబ్బ తినడంతో అష్టకష్టాలు పడుతున్నారు. టైగర్ జోన్ ఏర్పడడం వల్ల ఆంక్షలు అధికమయ్యాయి. అటవీ చట్టాలు అమలు పర్చడంతో ఇక్కడి అడవిపై ఆధారపడి ఉన్న చేతి వృత్తిదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దండేపల్లి, జన్నారం, చెన్నూరు, కోటపల్లి, నెన్నెల, బెల్లంపల్లి, మంచిర్యాల, భీమిని, లక్షెట్టిపేట, దేవాపూర్‌లలో 3,842 మంది అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట ప్రాంతాల్లోని నాయకపోడ్ గిరిజనులు సుమారు 3 వేల మంది అడవిలో లభించే వెదురుబొంగులపై ఆధారపడ్డారు. గతంలో అడవిని నమ్ముకుని అడవి నుంచి తీసుకువచ్చే వెదురు బొంగులతో తడకలు, బుట్టలు, చాటలు అల్లి మార్కెట్‌లో విక్రయించి ఉపాధి పొందేవారు. కానీ కవ్వాల టైగర్ జోన్ ఏర్పడినప్పటి నుంచి ఆంక్షలు అధికం కావడంతో వీరి జీవనోపాధి ఆగమ్య గోచరంగా మారింది. మంచిర్యాల జిల్లాలో 840 మహేంద్ర (మేదరి) కుటుంబాలు అల్లికపై ఆధారపడి ఉండగా అడవిలోకి వెళ్లకుండా అధికారులు ఆంక్షలు పెట్టడంతో బయట వెదురు బొంగులు దొరక్క, అడవి నుంచి తెచ్చే వీలు లేకపోవడంతో ఎలా జీవించాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. టైగర్ జోన్ ఏర్పాటుతో అడవిలోకి నో ఎంట్రీ ..టైగర్ జోన్ ఏర్పాటు కావడం, అటవీ చట్టాలను అమలు పర్చడంతో అడవిలోకి వెళ్లకుండా అటవీ అధికారులు ఆంక్షలు పెడుతున్నారు. దీంతో జీవనోపాధి లేక అడవిపై ఆధారపడ్డ చేతి వృత్తిదారులు రోడ్డున పడ్డారు. అటవీ చట్టాల నుంచి చేతి వృత్తిదారులకు మినహాయింపు ఇవ్వాలని పలుమార్లు రాష్ట్ర నాయకులు అటవీశాఖ అధికారులను వేడుకున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యంగానే ఉంది. ఏది ఉపాధి... కవ్వాల టైగర్ జోన్‌లోని అటవీ ప్రాంతంలో కోర్ ఏరియా (అటవీ ప్రాంతం) ఆధారపడ్డ మహేంద్రులకు, నాయకపోడ్ కుటుంబాలకు అటవీశాఖ అడవిలోనే ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అటవీ శాఖ అధికారులు అడవిలో ప్రస్తుతానికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నామని చేతులు దులుపుకుంటున్నారు. పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించడం లేదని పలువురు మేదరులు పేర్కొంటున్నారు. వీధిన పడిన మేదరులు, నాయకపోడ్‌లు టైగర్ జోన్ ఆంక్షలతో చేతి వృత్తిదారులు నష్టపోతున్నారు. అధిక ధరలకు వెదురుబొంగులు సేకరించి జీవనం వెళ్లదీద్దామన్నా ప్లాస్టిక్ రూపంలో మరో ఎదురు దెబ్బ తగిలింది. ప్లాస్టిక్ వస్తువులు అటవీ ఉత్పత్తుల కంటే తక్కువ ధరకు రావడంతో ప్రజలు వాటి వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో చేతి వృత్తిదారులు ఉపాధి లేక వీధిన పడ్డారు.



వెదురుబొంగులు అందుబాటులో లభిస్తే తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. చేతి వృత్తిదారులను ఆదుకోవాలి...అటవీ శాఖ ఆధ్వర్యంలో చేతి వృత్తిదారులను ఆదుకోవాలని మహేంద్ర సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకుండా పోయింది. అడవిపై ఆధారపడిన చేతి వృత్తిదారులకు సంవత్సరానికి 2 వేల వెదురు బొంగు లను ఉచితంగా ఇచ్చి అటవీ శాఖ తరుపున రుణ సౌకర్యం, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే చేతి వృత్తిదారుల జీవితాలు బాగు పడతాయని అంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దేవాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తిర్యాణిలలో వెదురు డిపోలు ఉండేవి. ప్రస్తుతం అవి లేకపోవడంతో చేతి వృత్తి దారుల పరిస్థితి దారుణంగా తయారైంది. వాటితో పాటు జన్నారం మండల కేంద్రంలో వెదురు డిపో ఏర్పాటు చేస్తే చేతి వృత్తిదారులకు పని లభిస్తుంది. ప్రభుత్వం మేదరులను ఆదుకుని జీవనోపాధి కల్పించాలని కోరుతున్నారు. అటవీ శాఖ ఆదుకోవాలి –సూరినేని కిషన్, జిల్లా మహేంద్ర సంఘం అధ్యక్షుడుఅడవిలోని వెదురు బొంగులను గతంలో మాదిరిగా దేవాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తిర్యాణిలో ఉన్న విధంగా బాంబు (వెదురు )డిపోలను ఏర్పాటు చేసి వెదురు బొంగులను అందించాలి. దీంతో చేతి వృత్తిదారులకు పూర్వ వైభవం వస్తుంది. వెదురుబొంగులు లేక పనులు లేవురాజేశ్వరి, జన్నారం వెదురు బొంగులు లేక చేతిలో పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రూ.10 లోపు ఒక వెదురు బొంగు లభించేది. ఇప్పుడు రూ.40 పెట్టినా లభించడం లేదు. దీంతో వెదురు బొంగులు తీసుకువచ్చి తట్టలు, బుట్టలు అమ్మి జీవించే తాము ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఉపాధి చూపించి ఆదుకోవాలి. అడవిలో ఉపాధికి చర్యలుఎఫ్‌డీవో మాధవరావుకవ్వాల టైగర్‌జోన్‌లో అడవిలో వన్య ప్రాణులు సురక్షితంగా భయం లేకుండా జీవించాలంటే అడవిలోకి ఎలాంటి వ్యక్తులు వెళ్లకూడదనే ఆంక్షలు ఉన్నాయి. అడవిలో ఉన్న చిన్న వస్తువును కూడా తీసుకువచ్చుకునే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అడవిలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాల మేరకు పనిచేస్తున్నాం. అడవి, వన్య ప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

# మున్సిపల్ ఉద్యోగాల భర్తీపై విజిలెన్స్

నిర్మల్ : రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్న నిర్మల్ పురపాలక సంఘం పారిశుధ్య కార్మికులని యామక ప్రక్రియపై విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు ఆంధ్రజ్యోతికి సమాచారం అందించాయి. మరోవైపు కొందరు నిరుద్యోగులు ఉన్న తాధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు ఈ నియామకాల ప్రక్రి యను రద్దుచేయాలన్న డిమాండ్‌తో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఉపాధికల్పనశాఖ అధికారులు సైతం ఈ భర్తీ ప్రక్రియను పూర్తిగా తప్పుబట్టినట్లు తెలుస్తోంది. ఆ అధికారులు తమ ప్రమేయం లేకుండా ఇష్టారీతిన భర్తీ ప్రక్రియ చేశారని, తాము ఇచ్చిన సీనియార్టీ జాబితాకు సంబంధించి ఇప్పటి దాక తమకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను మున్సిపల్ యంత్రాంగం అందిం చలేదని నివేదించినట్లు తెలిసింది. రంగంలోకి విజిలెన్స్పారిశుధ్య కార్మికుల పోస్టుల భర్తీపై విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఇప్పటికే ఉపాధి కల్పన శాఖ ఎన్ని సార్లు లేఖలు రాసినా మున్సిపల్, ట్రెజరీశాఖల నుంచి సమాచారం ఇవ్వకపోగా, నేరుగా ఉద్యోగుల ఐడీనంబర్‌లను ఇచ్చిన ట్రెజరీ అధికారులు మూడు నెలల పాటు జీతాలు కూడా విడుదల చేసినట్లు ప్రచారం ఉంది. అయితే తాజా వివాదం నేపథ్యంలో విజిలెన్స్ నివేదికలు వచ్చే వరకు కొత్తగా ఎంపిక చేసిన పారిశుధ్య కా ర్మికులకు జీతాలు నిలిపివేయాలని ట్రెజరీ శాఖ డైరెక్టరేట్ కార్యాలయం జిల్లా ట్రెజరీ శాఖ అధికారిని ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వివాదం ముగిసేంత వరకు ఎవరికి కూడా జీతాలు ఇవ్వవద్దని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే జీతాలు విడుదల చేయాలని జిల్లా ట్రెజరీ శాఖ అధికారిపై స్థానికనేతలు ఒత్తిడి పెం చుతున్నారని తెలిసింది. ఓ సీనియర్ ప్రజా ప్రతినిధితో పాటు మున్సిపల్ పాలకవర్గం అగ్రనేతలతో ఒత్తిడిలు పెట్టిస్తున్నట్లు ప్రచా రం ఉంది. అయితే ఈ విషయమై జిల్లా ట్రెజరీ అధికారి ప్రభాకర్ రావును వివరణ కోరగా ప్రస్తుతానికి జీతాలు ఇచ్చే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. గతంలో ఇచ్చిన జీతాల విషయమై అడిగితే ఆయన దాటవేశారు. తమకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటామన్నారు. అయితే ఆయన స్పష్టమైన జవాబు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. అధికారుల సెలవుపైనా ఆరాపురపాలకశాఖ పారిశుధ్య కార్మికుల నియామకాల వ్యవహారం అత్యం త వివాదాస్పదమైన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి బదిలీపై వెళ్లారన్న ప్రచారం అనేక అనుమానాలకు తావునిస్తున్న విషయం తెలిసిందే. ఆయన ఇక్కడి నుంచి సెలవుపై వెళ్లిపోగా తాజాగా సూర్యాపేట్‌లో పోస్టింగ్ పొందారు. అలాగే ఇన్‌చార్జీ సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ మురారిని కూడా బలవంతపు సెలవుపై పంపినట్లు అధికారవర్గాల్లో గుసగుసలున్నాయి. ఈ వ్యవహారంలో ఆయన పాత్రనే కీలకం అని అధి కార వర్గాల్లో ప్రచారం ఉంది. ఆయన ఆకస్మికంగా సెలవుపై వెళ్ళిపోవడంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్, సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సెలవుపై వెళ్ళిన విషయంపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో బడా బకాయిలపై దృష్టి

మంచిర్యాల : కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో బడా బకాయిల కు చెందిన ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో ఎస్పీఎం, సర్‌సిల్క్ మిల్లు ఉండగా, ఎస్పీఎం నుంచి రూ.4 కోట్లు, సర్‌సిల్క్ మిల్లు నుంచి రూ.3 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు రావాల్సి ఉంది. ఈ బకాయిలు వసూలు చేస్తే కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, ఏరియర్స్, ఇతర జీతభత్యాలు చెల్లించే వీలుంటుంది. ఈ లక్ష్యంతో అధికారులు పావులు కదుపుతున్నారు. గత మార్చి నెలలోనే పూర్తి స్థాయిలో చెల్లించాలని రెండు మిల్లులకు నోటీసులు పంపించారు. 2014నుంచి ఎస్పీఎం మిల్లు మూతబడింది. 2018లో కొత్తగా జేకేయాజమాన్యం చేతుల్లోకి తీసుకుంది. పాత బకాయి చెల్లింపులకు మినహాయింపు ఇచ్చి ప్రస్తుతం వచ్చే బిల్లుపై తమకు రివైజర్డ్ సర్వే చేసి నూతన బిల్లులు ఇచ్చేట్లు చూడాలని ఎస్పీఎం యాజమాన్యం మున్సిపల్ అధికారులకు నెల రోజుల క్రితం దర ఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ అధికారులు, బిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్పీఎం ఇన్‌చార్జీలు కొన్ని రోజులుగా కాలనీల్లో క్వార్టర్ల లెక్కింపులు చేస్తున్నారు. ఈ లెక్కింపులు కూడా పక్షం రోజుల్లోనే పూర్తి అయితే ఎన్ని క్వార్టర్లకు ఎంత మేర బిల్లులు వసూలు చేయాలన్నది తేలుతుంది. దీంతో ఎస్పీఎం నుంచి రావాల్సిన బకాయిలు క్లియర్ కానుంది. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను క్లియరెన్స్ అయ్యేందుకు అడుగులు పడుతుండటంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సర్‌సిల్క్ మిల్లు నుంచి రూ.3 కోట్ల మేర బకాయిలు ఉండటంతో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు ఆధ్వర్యంలో సిబ్బంది హైకోర్టు లిక్విడేటర్‌కు తమ బకాయిలు చెల్లింపులు చేయాలని నోటీసులను అందించారు. ప్రస్తుతం సర్‌సిల్క్ భూములు ఎంత ఉన్నాయి..? కబ్జాలో ఎంత ఉంది..? బిడ్డర్‌కు ఎంత భూములు పోతున్నాయనే విషయంలో అధికారుల సర్వేలు చేపట్టారు. ఈ ప్రక్రియ లిక్విడేటర్ పరిధికి చేరగా భూముల అమ్మకాలపై స్పష్టత రానుంది. ఈ భూముల అమ్మకాల ప్రక్రియ పూర్తి అయితే తొలుత సర్‌సిల్క్ మిల్లు కార్మికుల బకాయిలు చెల్లింపులు, ఆ తర్వాత మున్సిపల్ కార్యాలయల బకాయిల చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తామని హైకోర్టుకు లిక్విడేటర్ తెలిపినట్టు తెలిసింది. బడాబకాయిల పెండింగ్ వసూళ్లకు అడుగులు పడుతున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలోని 13948 నివాస గృహాలకు ఆస్తిపన్ను లక్ష్యం రూ.1.90 కోట్ల ఉండగా, ఇందులో రూ.1.35కోట్లు వసూలు అయ్యాయి. ఇంకా రూ.55లక్షలు వసూలు కావాల్సి ఉంది. వీటిపై అధికారులు తీవ్ర స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. వీటితో పాటు తాగునీటి బిల్లులు, ట్రేడర్స్ బిల్లులు కూడా వసూలు చేస్తున్నారు. వీటితో పాటు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.15లక్షలు మేర వసూలు కావాల్సి ఉంది. వీటి విషయంలో కూడా అధికారులు అన్ని కార్యాలయాలకు నోటీసులు కూడా పంపించారు. మున్సిపాల్టీలో 30 వార్డుల పారిశుధ్య పనులను తీసేందుకు 160మంది కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.15, 600 జీతంతో పనిచేస్తుండగా వీరికి సాలీన ఖర్చు రూ.2,99,52,000 అవుతోంది. ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికులు ఈఎస్‌ఐ, పీఎఫ్ పెండింగ్ బకాయిలు రూ.1.25 కోట్ల మేర ఉంది. బడా బకాయిలు వసూలు అయితే జీత భత్యా లతో పాటు కార్మికుల ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లింపులు చేసేందుకు కూడా మార్గం క్లియర్ కానుంది.బడా బకాయిలపైన్నే దృష్టి సారించాం..–సీవీఎన్ రాజు, కమిషనర్, కాగజ్‌నగర్కాగజ్‌న గర్‌లోని బడాబకాయిల వసూళ్లపై దృష్టి సారిస్తున్నాం. కాగజ్‌నగర్ మున్సిపాల్టీకి అతిపెద్ద చెల్లింపులు చేసే మిల్లులు రెండున్నాయి. ఇందులో ఎస్పీఎం నుంచి రూ.4కోట్లు, సర్‌సిల్క్ నుంచి రూ.3 కోట్లు మేర రావాల్సి ఉంది. ఎస్పీఎంకు ఆస్తి పన్ను రివైజ్డ్ చేసేందుకు వినతిపత్రాలు దాఖలు కావటంతో తమ సిబ్బంది, ఎస్పీఎం సిబ్బంది కలిసి పూర్తి స్థాయిలో లెక్కలు తీస్తున్నాం. త్వరలోనే ఎంతమేర చెల్లించాలన్న విషయం తేలుతుంది. సర్ సిల్క్ మిల్లు విషయంలో కూడా లిక్విడేటర్‌కు పూర్తి స్థాయిలో సమస్యలు వివరించాం. బడా బకాయిలు వసూలు జరిగితే కార్మికుల బకాయిలు అన్ని చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

# క్రమబద్ధీకరణలో కదలిక

నల్గొండ : అనధికార లేఅవుట్లల్లోని ఇళ్ల స్థలాల(ప్లాట్ల) క్రమబద్ధీకరణకు ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా నందికొండ మినహా మిగతా 18 పట్టణాల్లో 10 నవంబరు 2020 వరకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దరఖాస్తుతో పాటు రూ.1000 చొప్పున ప్రభుత్వం రుసుము వసూలు చేసింది. మొత్తం పూర్వ జిల్లా పరిధిలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వివిధ కారణాలతో రెండున్నరేళ్లుగా వాటిని పెండింగ్‌లో ఉంచారు. తాజాగా పురపాలికల్లోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలన్న ఉన్నతాధికారుల సూచనలతో అధికారులు పది రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

రెండు సార్లు అవకాశం

భారాస ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2015లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో ప్రతి దరఖాస్తుతోపాటు రూ.10,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 20 వేల దరఖాస్తులు వచ్చాయి. రెండేళ్ల పాటు వాటిని పరిశీలించి చాలా వరకు క్రమబద్ధీకరించారు. 2019లో మరోసారి ఫీజు చెల్లించిన వారి ప్లాట్లనూ క్రమబద్ధీకరించారు. అందులో ఇంకా మూడు వేల మంది దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పక్కన పెట్టారు. రెండో విడతలో 2019లో ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. రూ.1000 ఫీజుతో దరఖాస్తులు స్వీకరించింది. అప్పుడు



ఉమ్మడి జిల్లాలో 2.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్‌పై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అది ఇంకా తేలకుండానే ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టారు. అయితే రూ.1000 చెల్లించిన దరఖాస్తుదారులకే ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో రూ.10,000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పట్టించుకోకపోవడంతో వారు నిరాశతో ఉన్నారు.

భారీగా సమకూరనున్న ఆదాయం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అదే స్థాయిలో ప్రజలపై ఆర్థిక భారం పడనుంది. అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెటు విలువలో 14 శాతం రుసుము వసూలు చేస్తోంది. అది తమకు పెనుభారమని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక కుటుంబానికి పది ప్లాట్లు ఉంటే అందులో ఒకటి విక్రయించి వచ్చిన సొమ్ముతో మిగతా ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లల పెళ్లిళ్లు, భవిష్యత్ అవసరాల పేరిట కొందరు 20, 30 ఏళ్ల కింద ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఉన్నారు. ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు వసూలు చేస్తున్న రుసుము నాటి ప్లాట్ కొనుగోలుకు ఎన్నో రెట్లు ఎక్కువ ఉందని వాపోతున్నారు.

ప్రస్తుతానికి పట్టణాల్లోనే..

లక్ష్మినారాయణ, పట్టణ, గ్రామీణ ప్రణాళికాధికారి, నల్గొండ

ప్రస్తుతానికి పట్టణాల్లోని ప్లాట్ల దరఖాస్తులు మాత్రమే పరిశీలించాలని ఆదేశాలు ఉన్నాయి. పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. మార్గదర్శకాలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిశీలించి క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి పంపిస్తాం. చెరువులు, కుంటలు, గుట్టలు, రైల్వే లైన్ల వెంట ఉన్న వాటిని క్రమబద్ధీకరించడం లేదు. వాటిపై తదుపరి ఆదేశాల తర్వాత ముందుకు వెళ్తాం.

# పంటల రుణ పరిమితి ఖరారు

సూర్యాపేట : పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా రైతులకు రుణం అందిస్తూ తిరిగి సకాలంలో చెల్లించేలా ప్రోత్సహిస్తోంది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టెస్కాబ్) ఆధ్వర్యంలో రుణ లక్ష్యాన్ని విధించి వారికి పంటల వారీగా రుణాలు అందిస్తున్నారు. రుణాలు ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా 123 రకాల పంటలు ఎంపికైన జాబితాలో ఉండగా, ప్రస్తుతం 70 రకాలు సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఆయా పంటల సాగు చేసిన రైతులకు రుణాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. వచ్చే వానాకాలం పంటలకు బ్యాంకర్లు ఇచ్చే పంటల రుణపరిమితి ఖరారు చేశారు.

రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు పెంపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19,31,419 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో చాలా వరకు రైతులు ఆయా పంటలకు సంబంధించి రుణాలు పొందారు. సకాలంలో చెల్లించిన వారికి వచ్చే సంవత్సరంలో సాగు చేసే పంటలకు రుణం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రుణ ప్రణాళికను తయారు చేసి నాబార్డు, వ్యవసాయ శాఖలకు నెల రోజుల క్రితమే నివేదిక పంపించారు. సదరు నివేదిక ఆధారంగా నాబార్డు ఖరారు చేసింది. వానాకాలం సాగుకు రెండు నెలల ముందుగానే తుది జాబితా ప్రకటించారు. గత ఏడాదితో పోలిస్తే అన్ని రకాల పంటలకు రూ.2 వేల నుంచి రూ.6 వేల వరకు రుణం పెంచి అందించేలా కసరత్తు చేశారు.

కూరగాయల పంటలకూ..

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కొద్ది రకాల పంటలు మాత్రమే సాగు అవుతున్నాయి. అందులో వరి, పత్తి, కంది, పెసర, శనగ, వేరుసెనగ, మిరప పంటలు ఇందులో ఉన్నాయి. అక్కడక్కడ ఉల్లి, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఇవి కాకుండా ఉద్యాన పంటల వైపు రైతులు దృష్టి సారించారు. ప్రధానంగా మామిడి, నిమ్మ, జామ, బత్తాయి తోటలు సాగు చేస్తుండగా, ప్రస్తుతం ఆయిల్‌పామ్‌పై దృష్టి సారిస్తున్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించడంలో భాగంగా వారికి కూడా రుణం అందించేందుకు ఈ సారి ప్రభుత్వం ముందుకు వచ్చింది.

సద్వినియోగం చేసుకోవాలి: రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి, సూర్యాపేట

టెస్కాబ్ ఆధ్వర్యంలో బ్యాంకులు రైతులకు రుణం సౌకర్యం కల్పిస్తున్నాయి. ఈ సారి రెండు నెలలు ముందే రుణ ప్రణాళిక ఖరారు చేసింది. ఈ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని రుణం తీసుకోవాలి. ఉద్యాన, కూరగాయ పంటలకూ రుణం తీసుకోవడానికి అవకాశం ఉంది.

# యంత్రం పదిలం.. ఆపరేటర్ క్షేమం



పెద్దపల్లి: గత ఏడాది ఓసీపీ-1లో డంపర్ ప్రమాదానికి గురై ఆపరేటర్ శ్రీనివాసరావు మృతి చెందాడు. తెల్లవారు జామున పొగమంచు ఉండటంతో ఆగి ఉన్న డంపర్‌ను ఢీకొట్టడంతో దాని వెనుక భాగం క్యాబిన్‌లోకి చొచ్చుకువచ్చి ఆపరేటర్ అందులోనే దుర్మరణం చెందాడు. డంపర్ నడిపించే ఆపరేటర్ క్యాబిన్‌కు ముందు కేవలం అద్దం మాత్రమే ఉంటుంది. ప్రమాదానికి గురైన సమయంలో రక్షణ లేకుండా పోతుంది. దీంతో ఆపరేటర్ ముందుగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏడాదిన్నర క్రితం ఇదే విధంగా మరో డంపర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓసీపీ-3లో ఆపరేటర్ మృతి చెందాడు. ఈ సంఘటన సైతం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఉదయం సమయంలో ఉపరితల గని క్వారీల్లో పొగ మంచు ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఆపరేటర్లకు ముందు స్పష్టంగా కనిపించదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

సింగరేణి ఉపరితల గనుల్లో ఎక్కువ శాతం డంపర్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఆపరేటర్లు మృతి చెందుతుండటంతో పాటు కొంత మంది తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడుతున్నారు. తెల్లవారు జామున క్వారీల్లో పొగ మంచుతో పాటు రాత్రంతా ఆపరేటింగ్ విధులు నిర్వహించడం వల్ల నిద్ర ముంచుకొస్తుంటుంది. దీంతో ఎక్కువగా తెల్లవారు జామున ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి. ఆపరేటర్‌లకు రక్షణతో పాటు డంపర్ ఎక్కువ శాతం దెబ్బతినకుండా అధికారులు సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. ప్రస్తుతం ఓసీపీ-3లో దీనిని మొదలు పెట్టారు. డంపర్ క్యాబిన్ ముందు భాగంలో ఇనుప రాడ్డులతో ఫ్రేమ్‌ను అమర్చుతున్నారు. డంపర్ ప్రమాదానికి గురైనా క్యాబిన్ ముందు భాగంగా ఎక్కువగా దెబ్బతినకుండా ఉండేందుకు ఈ ప్రయోగం చేస్తున్నారు. దీంతో క్యాబిన్‌కు రక్షణ ఉంటుంది. ఫలితంగా ఆపరేటర్ ప్రమాదానికి గురికాకుండా ఉండే అవకాశం ఉంది. ప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నప్పటికీ ముందు ఏర్పాటు చేసిన ఇనుప ఫ్రేమ్ కొంత వరకు ప్రమాద తీవ్రతను నిరోధించనుంది. ఇనుప ఫ్రేమ్ క్యాబిన్‌కు రెండు ఫీట్ల దూరం నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు ఢీకొన్న పక్షంలో ముందుగా ఇనుప ఫ్రేమ్‌పై ఒత్తిడి పడుతుంది. దాని నుంచి లోపలికి వచ్చే సరికి తీవ్రత తగ్గుతుంది.

అన్ని ప్రాంతాల్లో అమలుకు యోచనప్రమాదవశాత్తు ఎదురుగా ఉన్న డంపర్‌ను ఢీకొన్నా ఫ్రేమ్ వల్ల తీవ్రత తగ్గి ఆపరేటర్ సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఓసీపీ-3లో ఈ ప్రయోగాన్ని మొదలు పెట్టారు. దీనిని సింగరేణి వ్యాప్తంగా అన్ని ఉపరితల గనుల్లో అమలు చేసేందుకు యాజమాన్యం ఆలోచిస్తోంది. ముందుగా 100, 80 టన్నుల డంపర్లకు ఇనుప ఫ్రేమ్‌ను తయారు చేస్తున్నారు. ఆ తర్వాత తక్కువ సామర్థ్యం కలిగిన డంపర్లకు సైతం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కోట్ల రూపాయల విలువ చేసే డంపర్లకు ఇది రక్షణగా ఉండనుంది. ప్రమాదానికి గురైన సమయంలో వాహనంలోని లోపలి భాగాలు దెబ్బతినకుండా ఉండే అవకాశముంది.

# బడి తెరిచే నాటికి సిద్ధం



పెద్దపల్లి : వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. యూడైస్ నివేదిక ఆధారంగా అవసరమైన పుస్తకాలను ముద్రిస్తున్నారు. కొన్నేళ్లుగా ఏటా సగం విద్యాసంవత్సరం ముగిసిన తర్వాత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేవారు. ఈ సారి పుస్తకాల కొరత లేకుండా ముందస్తుగా లక్ష్యాలను అనుగుణంగా జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మాధ్యమాల్లో ముద్రించే బైలింగ్వల్ విధానాన్ని గతేడాది అమలు చేయగా ఈసారి కూడా కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 40 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు జిల్లాలకు చేరాయి. జూన్ మొదటి వారంలో మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు తరలించనున్నారు.

ద్విభాష.. క్యూఆర్ కోడ్

గతంలో పాఠ్యపుస్తకాలను ఒకే మాధ్యమంలో ముద్రించేవారు. ప్రస్తుతం పుస్తకంలో ఒకవైపు తెలుగు, మరోవైపు ఆంగ్లంలో ముద్రణ ఉంటుంది. దీంతో తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్లంలో చదువుకోవడం సులభంగా ఉంటుంది. గత సంవత్సరం తొలిసారిగా 3 నుంచి 8 తరగతుల వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి వరకు అమలవుతోంది. పిల్లలు తమకు అర్థం కాని విషయాలను తెలుగు, ఆంగ్ల భాషల్లో చదువుకుంటున్నారు. ప్రతి పాఠానికి రెండు వైపులా తెలుగు, ఆంగ్లంలో ముద్రించడంతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో పాఠ్యాంశాలకు సంబంధించి లోతైన పరిజ్ఞానం తెలుసుకుంటున్నారు.

సకాలంలో విషయ పరిజ్ఞానం

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు విడతల వారీగా చేరుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17,08,910 పాఠ్యపుస్తకాల అవసరం ఉంది. ఇందులో ఆయా జిల్లాల్లో గతేడాదికి సంబంధించి 1,03,070 పుస్తకాలు మిగులు నిల్వ ఉండగా మిగిలిన 16,05,840 పుస్తకాలు సరఫరా అవుతున్నాయి. బైలింగ్వల్ విధానంలో ముద్రణ నేపథ్యంలో కొంత ఆలస్యం జరుగుతోంది. ఎలాంటి సమస్యలు లేకుండా పుస్తకాలు సరఫరా చేస్తే విద్యార్థులకు సకాలంలో విషయ పరిజ్ఞానం అందనుంది. జూన్ నెలలో బడిబాట సందర్భంగా పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, కార్పొరేట్ స్థాయిలో విద్యా బోధన అందుతుండటంతో సర్కారు బడులకు ఆదరణ పెరుగుతోంది.

కొరత లేకుండా పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నాం. బడుల ప్రారంభం నాటికి అన్ని చోట్లకూ పంపిస్తాం. జిల్లాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. వాటిని జిల్లాకేంద్రంలో భద్రపరుస్తున్నాం. ఎక్కడా కొరత లేకుండా పంపిణీ చేస్తాం. బైలింగ్వల్ పుస్తకాలతో సామర్థ్యాలు మెరుగు పడుతున్నాయి.మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

# యార్డు వెలుపలే కాయల సేకరణ

జగిత్యాల : జగిత్యాల వ్యవసాయ మార్కెట్యార్డు పరిధి చల్‌గల్‌లోని మామిడి మండీ పరిధిలో కాయల కొనుగోలులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మామిడి మార్కెట్లో రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నాలుగు భారీ షెడ్లు అందుబాటులోకి రావటం, చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి తీసుకోవటంతో ఈ సీజనులో వ్యాపారులందరూ యార్డులోకి రావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా యార్డు వెలుపల తమ సొంత స్థలాలు, ప్రైవేటు అద్దెస్థలాల్లో కొనుగోళ్లు జరపవద్దని, వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు వ్యాపారులకు నెలరోజుల క్రితమే నోటీసులు జారీచేశారు. ఇందుకు అనుగుణంగా గత సీజన్‌లో మార్కెట్ఫీజు చెల్లించిన వ్యాపారులకు వరుసక్రమంలో మార్కెట్లోని షెడ్లలో స్థలాన్ని కేటాయించారు. ఐనా కూడా ఇప్పటికీ దాదాపుగా 17 మంది వ్యాపారులు యార్డు వెలపలే మామిడి కాయల క్రయవిక్రయాలను జరుపుతుండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారా?

వ్యాపారులు కొనుగోలు చేసిన సరకును ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు మార్కెటింగ్‌శాఖ తక్‌పట్టీ తప్పనిసరిగా కావాలి. కొనుగోలు చేసిన కాయల విలువను అనుసరించి మార్కెట్ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు యార్డులోకి రానందున అధికారులు వారికి తక్‌పట్టీల పుస్తకాలను ఇవ్వలేదు. ఐనాకూడా కొందరు వ్యాపారులు చెక్‌పోస్టులవద్ద కొంత ఫీజును చెల్లించి మామిడి కాయలను ఎగుమతి చేస్తున్నారు. ఇప్పటికే 27 వేల క్వింటాళ్ల వరకు మామిడి కాయలను కొనుగోలు చేశారు. దీంతో విలువకు సమానంగా ఫీజును చెల్లిస్తున్నారా లేక విలువను తగ్గించి తక్కువఫీజు చెల్లిస్తున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు మార్కెటింగ్‌శాఖ స్థానిక తక్‌పట్టీ పుస్తకాల్లో రికార్డు లేకుంటే వచ్చే సంవత్సరం షెడ్ల కేటాయింపు సక్రమంగా ఉండదు. ప్రైవేటుగా సేకరణ జరిపినపుడు అధికారుల ఆజమాయిషీ కొరవడుతుంది, తూకం, ధరల చెల్లింపు తదితరాల్లోనూ అవకతవకలు జరిగే అవకాశముంది.

ఈసారీ అటకెక్కిన బహిరంగ వేలం

నిబంధనల ప్రకారం రైతుల నుంచి కమీషన్ తీసుకునే వ్యాపారులు తప్పనిసరిగా కాయలను బహిరంగ వేలం పద్ధతిన కొనుగోలు చేయాలి. కానీ నిరుటి వరకు కమీషన్ తీసుకున్నా కూడా మండీలో పక్కాషెడ్లు అందుబాటులో లేవన్న కారణంచూపి వ్యాపారులు బహిరంగ వేలాన్ని పాటించలేదు. ఈ సారి యార్డులోనే కొనుగోళ్లు జరపాలని, వేలం పద్ధతిని పాటించాలని నిర్ణయించినా వ్యాపారులందరూ యార్డులోకి రాకపోవటంతో ఇక బహిరంగ వేలం ఈ సీజన్‌లోనూ అమలయ్యేలాలేదు. నాగ్‌పూర్ మామిడి మార్కెట్ మాదిరిగా కాయలను బహిరంగ వేలంలో కొనుగోలు చేస్తే వ్యాపారుల మధ్య పోటీపెరిగి ధరలుహెచ్చి రైతులు, తోటల గుత్తేదారులకు లాభించే అవకాశమున్నా వేలం అమలు చేయటం లేదు. మరోవైపు తరుగు, చిన్నకాయలు, మంగు తదితరాలపేరిట కోతలు రివాజుగా మారగా ధరల స్థిరత్వానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్‌కు నివేదిక – టి.రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి, జగిత్యాల

వ్యాపారులందరూ చల్‌గల్ మామిడి యార్డులోకి రాకపోవటంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. కలెక్టర్ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటున్నాం. కొనుగోలు చేసిన కాయల విలువ ప్రకారంగా ఫీజు వసూలు చేస్తాం.

# సమాఖ్య.. స్వాహాపర్వం

ఏర్గట్ల: గ్రామీణ మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పని చేయాల్సిన డ్వాక్రా సంఘాలు అవినీతి బాట పడుతున్నాయి. బ్యాంకు రుణాల చెల్లింపుల్లో మహిళా సంఘాల ప్రతినిధులతో పాటు, సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. సంఘాల సొమ్ము సొంత అవసరాలకు వాడుకుంటూ అమాయకులైన మహిళలను మోసం చేస్తున్నారు. ఇటీవల వెల్కటూర్, ఏర్గట్ల గ్రామ సమాఖ్యల్లో వెలుగుచూసిన అవినీతి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. ఏర్గట్లలో స్వప్న గ్రామ మహిళా సంఘం రూ.5 లక్షల బ్యాంకు లింకేజీ రుణం తీసుకుంది. పది మంది సభ్యులు సంఘం అధ్యక్షురాలు లక్ష్మికి ప్రతినెల వాయిదా చెల్లిస్తున్నారు. కానీ, సదరు మహిళా ఆ డబ్బులను బ్యాంకులో చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకుంది. వరుసగా 11 నెలలకు సంబంధించిన రూ.3.29 లక్షల కిస్తీని(వాయిదా) స్వాహా చేసింది. విషయం బయటపడి సభ్యులు ఒత్తిడి చేయడంతో రూ.1.60 లక్షలు చెల్లించింది. మిగతా సొమ్ము రూ.1.69 లక్షలు చెల్లించకపోవడంతో సభ్యులు ఈ నెల 22న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెండోరా మండలం వెల్కటూర్‌లో గతేడాది ఐకేపీ వీవోఏ, సీఏ కలిసి సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్మును బ్యాంకులో చెల్లించకుండా స్వాహా చేశారు. అవినీతి బయటకు రావడంతో జిల్లా అధికారులు స్పందించి విచారించారు. ఇద్దర్నీ విధుల్లో నుంచి తొలగిస్తూ సొమ్ము రికవరీకి ఆదేశించారు.

కంచె చేను మేసిన చందంగా..

జిల్లాలో 825 గ్రామ సంఘాలు ఉండగా వాటిలో 24,030 సంఘాలు, 2,38,511 మంది సభ్యులున్నారు. వీరంతా పొదుపు చేస్తూ ఏటా బ్యాంకుల నుంచి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుంటున్నారు. ప్రతి నెల వాయిదాలు చెల్లిస్తున్నారు. ఈ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించడానికి గ్రామస్థాయిలో ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటైంది.



వీరిలో సంఘం అధ్యక్షురాలు, వీవోఏలు, సీఏలు, ఏపీఎంతో పాటు బ్యాంకు ఫీల్డ్ సిబ్బంది ఈ లావాదేవీలను పర్యవేక్షిస్తూ అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలి. కానీ, కంచె చేను మేసిన చందంగా సంఘం అధ్యక్షురాళ్లు, సిబ్బందే అవినీతికి పాల్పడుతున్నారు. దీంతో అమాయకులైన సభ్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని సంఘాల మహిళలు భావిస్తున్నారు.

రికవరీ చేయిస్తాం

రూ.3.29 లక్షలకు గానూ రూ 1.60 లక్షలు రికవరీ చేశాం. మిగిలిన రూ 1.69 లక్షలను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్నాం. సంఘ సభ్యులకు నష్టం జరగకుండా చూస్తాం. ఇతర సంఘాల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ బలోపేతం చేస్తాను. శ్యాం, ఏపీఎం, ఏర్గట్ల

నిబంధనలు ఇవీ..

సంఘం సభ్యులు చెల్లించిన కిస్తీని అధ్యక్షురాలు వసూలు చేసి ప్రతినెల ఒక సభ్యురాలితో బ్యాంకులో కట్టించాలి. కానీ, చాలా సంఘాల్లో అధ్యక్షురాలే ఖాతాల్లో జమ చేస్తున్నారు.

వాయిదా చెల్లించిన తర్వాత కౌంటర్ ఫైల్ తీసుకోవాలి. సంఘం ఖాతా పుస్తకంలో చెల్లించిన నగదును నమోదు చేయించాలి. కౌంటర్ ఫైల్ తీసుకోకపోగా ఖాతా పుస్తకంలో నమోదు చేయించడం లేదు.

ప్రతి నెల చెల్లించిన కిస్తు కౌంటర్ ఫైల్, ఖాతా పుస్తకాన్ని ప్రతి నెల గ్రామ సంఘంలో జరిగే సమావేశంలో వీవోఏలు తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. కానీ, వీవోఏల నిర్లక్ష్యం, సీఏల పర్యవేక్షణ లోపం కారణమవుతోంది.మూడు నెలలుగా వాయిదాను బ్యాంకులో చెల్లించకపోతే బ్యాంకు మేనేజర్ లేదా ఫీల్డ్ అధికారి నేరుగా సంఘాల డ్యూలిస్టును సీఏకు పంపించాలి. 6 నెలలైతే ఏపీఎంకు సంఘాల అప్పు జాబితాను అందించాలి. బ్యాంకుల్లో పని ఒత్తిడి పేరుతో అధికారులు నెలల తరబడి అప్పు జాబితా ఏపీఎంకు అందించడం లేదు.

# సరిహద్దుల్లో అక్రమ దందా

ఇందూరు : మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న యువకులను తాజాగా నగర పోలీసులు పట్టుకొన్నారు. గతంలో దేశీదారు నిల్వలను సైతం సీజ్ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గతంలో ఎక్సైజ్‌శాఖ జరిపిన సోదాల్లోనూ.. దేశీదారు, గంజాయి నిల్వలు స్వాధీనం చేసుకొన్నారు. మహారాష్ట్ర సరిహద్దు కేంద్ర బిందువుగా వీటి అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

దేశీదారు.. రాష్ట్రంలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) కిందకు వస్తుంది. స్థానికంగా ఈ మద్యాన్ని విక్రయించొద్దు. కానీ, కొందరు యథేచ్ఛగా నిజామాబాద్‌కు ఈ మద్యాన్ని తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ధర్మాబాద్ నుంచి బాసర మీదుగా జిల్లాకు దేశీదారు నిల్వలు రవాణా అవుతున్నట్లు సమాచారం. నాందేవ్‌వాడ, హమాల్‌వాడి, ఖిల్లా చౌరస్తాలో ఇప్పటికి కొందరు దీన్ని విక్రయిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎక్సైజ్‌శాఖ అధికారులు,



సిబ్బంది గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. గంజాయి సాగుచేస్తున్న వారిని సైతం ప్రత్యేకంగా గుర్తించారు. రైతుబంధు రాకుండా చర్యలు చేపట్టారు. అయినా తిరిగి పలు తండాల్లో గంజాయి సాగు జరుగుతుందని, వివిధ ప్రాంతాల నుంచి యువత వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

కేవలం ఐదు కేసులే నమోదు..నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది కేవలం ఐదు కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి ఈ స్టేషన్ పరిధిలో అధికారులు, సిబ్బంది మధ్య సయోధ్య లేక మూడు నెలల పాటు ఎక్కడా తనిఖీలు చేపట్టలేదు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. అయితే స్టేషన్ల సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ బృందం సమన్వయంతో పనిచేస్తే పెద్దమొత్తంలో కేసుల నమోదుకు ఆస్కారం ఉంటుంది. అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయొచ్చు.

# 116 రోజులు.. 36 టీఎంసీలు

ఖమ్మం : సాగర్ ఆయకట్టుకు యాసంగి నీటి విడుదల షెడ్యూలు ముగిసింది. జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఈ ఏడాది రబీ పంటలకు గత డిసెంబరు 16 నుంచి ఈనెల 21 వరకు పూర్తి స్థాయిలో నీటి సరఫరా కొనసాగింది. నీటి సరఫరా నిలిపివేయడంతో గేట్ల నుంచి ఎలాంటి లీకేజీలు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు. డిసెంబరు 16 నుంచి ఏప్రిల్ 21 వరకు 126 రోజుల



వ్యవధిలో కారణాల రీత్యా 10 రోజులపాటు సరఫరా నిలిచిపో యింది. జిల్లాలో సాగు అవసరాలకు 36 టీఎంసీల నీటిని విడుదల చేశారు. 2.51 లక్షల ఎకరాలకు సాగునీరు.. నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలో కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయానికి ఎగువన మొదటి జోన్ పరిధిలో సుమారు 4 వేల ఎకరాలతోపాటు రెండో జోన్ పరిధిలోని 17 మండలాల్లో 2.51 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. పూర్తిస్థాయిలో నీటి సరఫరా కొనసాగడంతో జిల్లాలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలు అధిక దిగుబడులను ఇచ్చాయి. ఆయకట్టు రైతులు ఈ ఏడాది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# 57 రకాల పరీక్షలు.. ఉచితం!

భూపాలపల్లి : వైద్యం అందించడానికి రోగ నిర్ధారణ కీలకం.. ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రైవేటులో వైద్య పరీక్షలకు పెద్దఎత్తున ఖర్చవుతోంది.. ఇది పేదలకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డయాగ్నొస్టిక్ కేంద్రాలకు రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో టీహబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. త్వరలోనే ప్రారంభంకానున్న తెలంగాణ రక్త పరీక్షల కేంద్రం టీ-హబ్ ద్వారా ఉచితంగా 57 రకాల పరీక్షలను చేయించుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లాలోని గణపురం, రేగొండ పీహెచ్‌సీలకు సంబంధించిన పలు నిర్ధారణ పరీక్షలను ములుగు జిల్లాలోని టీ డయాగ్నొస్టిక్ కేంద్రానికి పంపించి వివరాలను తెప్పించుకుంటుండగా మిగిలిన మండలాల ప్రజలు వరంగల్ లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో త్వరలో ప్రారంభం కానున్న టీ-హబ్ కేంద్రం ద్వారా అలాంటి ఇబ్బందులు తప్పనున్నాయి. థైరాయిడ్, బీపీ, షుగర్, డెంగీ, బ్లడ్ ప్రొఫైల్, హార్మోన్, బయో కెమికల్, బ్లడ్ గ్రూపింగ్, క్యాన్సర్, కాలేయం, ఇలా 57 రకాల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసే అవకాశం ఉంటుంది. అదే రోజు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రక్త నమూనాలను పరీక్షిస్తున్నారు.

అల్ట్రాసౌండ్

ఈ యంత్రం ద్వారా కడుపులోని సమస్యలను గుర్తించవచ్చు.. గర్భిణులను పరీక్షించి పిండం ఎదుగుదల, లోపాలు ఉంటే తెలుసుకునే అవకాశం ఉంటుంది. కడుపునొప్పి, ఉబ్బరం, పేగు సమస్యలు, కడుపులో గడ్డలు, జీర్ణ సంబంధిత వ్యాధులు గుర్తించడంలో ఎంతో ఉపయోగపడుతుంది.



ఇమ్యూనో అనలైజర్

దీని ద్వారా థైరాయిడ్‌కు సంబంధించి టీ3, టీ4, టీఎఫ్‌హెచ్ ఇలా మూడు రకాల పరీక్షలను చేస్తారు. అలాగే విటమిన్ డి3, బీ12 తదితర పరీక్షలను ఉచితంగా చేయనున్నారు. యంత్రం ద్వారా గంటకు 200 నమూనాలను సేకరించి పరీక్షలు చేయవచ్చని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.

2డీ-ఎకో

ఈ యంత్రం ద్వారా గుండె పనితీరు, గుండె పరిమాణం, గుండె స్థానాన్ని సమీక్షించడం, గుండె నాలుగు గదుల కొలతలను లెక్కించడం, గుండె సమీపంలోని వివిధ నాళాల పరిమాణాల అంచనా, గుండెలో రంధ్రాలు, ఇన్ఫెక్షన్ తదితర వాటిని అంచనా వేస్తుంది.

బయో కెమిస్ట్రీ అనలైజర్

ఈ యంత్రం ద్వారా కాలేయ సంబంధిత వ్యాధుల నిర్ధారణ చేసుకోవచ్చు. ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, కాలేయం, కిడ్నీ పనితీరుపై పలు రకాల పరీక్షలను చేయవచ్చు. నిత్యం 400 నుంచి 600 మంది నమూనాలను పరీక్షించే అవకాశం ఉంటుంది.

మెమో గ్రామ్

మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య రొమ్ము క్యాన్సర్.. ఈ యంత్రం ద్వారా రొమ్ములో గడ్డలు, కణతులు, క్యాన్సర్ గడ్డలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. నిత్యం 20 నుంచి 30 మందికి పరీక్షలు చేయవచ్చని సంబంధిత సిబ్బంది తెలిపారు.

ప్రయోగాత్మకంగా పరీక్షలు-డాక్టర్ జీడి తిరుపతి, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీ-హబ్ సేవలను త్వరలోనే అధికారికంగా అందుబాటులోకి తీసుకొస్తాం.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రయోగాత్మకంగా రోగులకు పరీక్షలను చేపడుతున్నాం. పరీక్షల ఫలితాలను ములుగు డయాగ్నస్టిక్స్‌కు పంపించి సరిగా ఉన్నాయో లేవో తెలుసుకుంటున్నాం.

# విద్యుత్తు శాఖలో సమ్మె సైరన్




ఖమ్మం : విద్యుత్తు శాఖలో ఆర్టిజన్ కార్మికులు సమ్మెకు పిలుపునివ్వడంతో టెన్షన్ ప్రారంభమైంది. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం(25వ తేదీ) నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. తక్కువ వేతనాలకు ఏళ్ల తరబడి పని చేస్తున్న తమపై యాజమాన్యాలు ఎస్మా చట్టం ప్రయోగిస్తామని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నాయని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిజన్లు విద్యుత్తు సంస్థలైన ఉత్పత్తి (జెన్కో), సరఫరా (ట్రాన్స్‌కో), పంపిణీ(ఎన్పీడీసీఎల్)లో కంప్యూటర్ ఆపరేటర్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, అటెండర్లు, వాచ్‌మన్లు వంటి వివిధ పోస్టుల్లో తాత్కాలిక పద్ధతిపై నియమితులై ఏళ్ల తరబడి పని చేస్తున్న వారు ఆర్టిజన్లుగా గుర్తింపు పొందారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈ సంస్థల్లో సుమారు 2,400 మంది పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

డిమాండ్లు

ఇటీవల ప్రకటించిన వేతన సవరణ(పీఆర్సీ)లో ఆర్టిజన్ల వేతనం 7 శాతం పెంపునకు ప్రభుత్వం అంగీకరించింది. తమకు దీనివల్ల కేవలం రూ.3 వేలకు మించి ప్రయోజనం కలగడం లేదని వారు వాపోతున్నారు. 51 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం పర్మనెంట్ చేశామని శాసనసభలో ప్రకటించిన విధంగా తమకు శాశ్వత ఉద్యోగులతోపాటు అలవెన్సులు అందడం లేదని, తమకు ఈ వసతులన్నీ కల్పించాలని కోరుతున్నారు.

ఎస్మా చట్టం...

ఆర్టిజన్లు 25 నుంచి సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించింది. సమ్మెను నిషేధిస్తున్నామని ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని ఆదేశించింది. 25న ఉదయం 8 గంటలకు ప్రతి ఒక్కరూ తాము పనిచేసే ప్రాంతంలో హాజరు కావాలని, లేకుంటే సమ్మె చేస్తున్నట్లుగా గుర్తించి విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆర్టిజన్లు వాపోతున్నారు. అలాగే కొందరు నాయకులను బైండోవర్ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. పీఆర్సీలో మేలు జరిగిన ఉద్యోగ సంఘాలు వారికి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడంలేదు. అయినా కొందరు సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలుస్తుండటంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీనిపై ఆర్టిజన్ల సంఘ నాయకులతో చర్చించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. 'సమ్మెలు నిషేధం'- సురేందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్, ఖమ్మం

అత్యవసర సేవల విభాగమైన విద్యుత్తు సంస్థలో సమ్మెకు దిగడం ఎస్మా-1971 చట్టరీత్యా నేరమని ఎన్పీడీసీఎల్ ఛీఫ్ విజిలెన్సు అధికారి బి.జనార్దన్ తెలిపారు. విద్యుత్తు సంస్థల్లో సమ్మెలను నిషేధించామన్నారు. ఎవరైనా సమ్మెకు వెళితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాజమాన్యం సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు సమ్మెకు వెళ్తుండటంతో సంస్థ పరిధిలోని వరంగల్, జనగామ, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలో కొందరు ఆర్టిజన్ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నామని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టిజన్ల సమ్మెపై యాజమాన్యం వారితో చర్చిస్తోంది. కార్మికులు సైతం సమ్మెకు వెళ్లేందుకు సుముఖంగా లేరు. సమ్మె ప్రభావం విద్యుత్తు సరఫరాపై లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

# చిట్టి ఆలోచన.. గట్టి ఆవిష్కరణ



పెద్దపల్లి: 'చెట్టుపై నుంచి యాపిల్ పండు పడ్డప్పుడు న్యూటన్‌కు తట్టింది.. ఆర్కిమిడీస్‌కు నీటి తొట్టి వద్ద పుట్టింది..' ఆలోచన ఎప్పుడైనా కలగొచ్చు.. ఉపాయం ఎవరికైనా రావొచ్చు.. బాలలూ.. మీరే భావి శాస్త్రవేత్తలు. ఖాళీ సమయం వృథా చేయకుండా ఆలోచనలను ఆవిష్కరణల వైపు మళ్లించుకునేందుకు ఇదే తరుణం. మేధస్సును పరీక్షించుకునేందుకు ఆన్‌లైన్‌లో వివిధ రకాల విజ్ఞాన పోటీలు అందుబాటులో ఉన్నాయి. చిన్నారుల ఆలోచనలకు పదును పెట్టి, వారిని ప్రోత్సహించే వారు లేక జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించలేకపోతున్నారు. మొక్కుబడిగా పరిశోధన నమూనాలు రూపొందించడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. వేసవి సెలవుల్లో ఇంటి వద్దనే సాధన ప్రారంభిస్తే సత్ఫలితం వస్తుంది. ఇక ఆలస్యం ఎందుకు. శాస్త్రవేత్తగా ఎదిగే మార్గాలు, ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శనలు, నిపుణుల ప్రోత్సాహం తదితర అంశాలను తెలిపే కథనం.

నైపుణ్య వికాసానికి పదును ఇలా

లి పరిశోధన నమూనాను హడావుడిగా నమోదు చేసుకొని ప్రదర్శనలో పాల్గొంటున్నారు.

లి సైన్స్ ఉపాధ్యాయుల సలహాలతో నిత్యం సాధన చేస్తుండాలి.

లి విద్యార్థుల మేధకు పదును పెట్టేందుకు ఉద్దేశించిన వైజ్ఞానిక పోటీల్లో ఆశించిన ప్రతిభ కనిపించడం లేదు.

లి వినూత్న రీతిలో ఆవిష్కరణలు రూపుదిద్దుకోవడం లేదు. పిల్లల్లో జిజ్ఞాస కొరవడింది.

లి దీంతో పైసా ఖర్చు లేకుండానే బహుళ ప్రయోజనం చేకూరేలా ఫలితాలు వస్తాయి.

పరిసరాలే పరిశోధనకు బీజం

మన చుట్టూ ఉన్న పరిసరాలు, నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలే పరిశోధనలకు మూలాలు. గుర్తించిన సమస్యలను విశ్లేషించి వాటి పరిష్కారానికి తగిన ఆలోచనలు చేసినపుడే ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయి. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకుంటే సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. చిట్టి బుర్రలో మెరిసిన ఆలోచనకు నైపుణ్యం జోడిస్తే ప్రయోగాలకు ఫలితం వస్తుంది.

ఆన్‌లైన్‌లో విజ్ఞాన ప్రదర్శనలు

విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఊతమిస్తున్నాయి. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధీనంలోని సీఎస్ఐఆర్(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) జాతీయ స్థాయిలో ఇన్నోవేషన్ అవార్డు స్కూల్ చిల్డ్రన్ పేరిట వైజ్ఞానిక పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జాతీయ స్థాయి ప్రదర్శనలో అత్యుత్తమ నమూనాలకు నగదు పారితోషికం అందిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ రావాల్సి ఉంది.

ఈ బుడతలు.. ధరణి నేస్తాలు

మితిమీరిన క్రిమిసంహారక మందుల వినియోగంతో నేలలో పోషకాలు తగ్గి పంట దిగుబడి తగ్గుతుందన్న కన్నవారి మాటలే ఆ విద్యార్థులను పరిశోధనల వైపు పురిగొల్పాయి. తమ పెద్దల కష్టాలకు కొంత పరిష్కారం చూపేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట పాఠశాల విద్యార్థులు మట్టి నాణ్యత పరికరాన్ని కనుగొన్నారు. వారి పొలంతో చుట్టుపక్కల రైతులకు చెందిన భూసారాన్ని పరీక్షించి అవగాహన కల్పించారు.

శభాష్.. హర్షితపెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాసరి హర్షిత తన ఆలోచనతో ఏకంగా దేశ ప్రథమ పౌరురాలి ఎదుట ప్రదర్శన ఇవ్వగలిగింది. ప్రమాదాలతో పాటు పొగ, దుమ్ము నుంచి రక్షణ కవచంగా నిలిచే 'మల్టీ పర్పస్ హెల్మెట్(బహుళ ప్రయోజన శిరస్త్రాణం) రూపొందించిన ఆమెను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. వాయు కాలుష్యం నుంచి కాపాడుకునే ఆవిష్కరణ వినూత్నం అంటూ కితాబిచ్చారు.

ఆసక్తి నింపి.. ఆలోచనలు పెంచి..

'అవసరం నుంచి ఆలోచన.. ఆ ఆలోచన నుంచి ఆవిష్కరణ' అనే సిద్ధాంతాన్ని బోధిస్తూ బాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతున్నారు రాజన్నసిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్. వేసవిలో ఆన్‌లైన్‌లో పరిశోధనలపై ఆయన మెలకువలు అందిస్తున్నారు. వినూత్నంగా ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు. రామగిరి మండలం చందనాపూర్, దమ్మన్నపేట విద్యార్థులు అయిదు సార్లు అంతర్జాతీయ, 11 సార్లు జాతీయ ప్రదర్శనల్లో సత్తా చాటడంలో సంపత్‌కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆసక్తి ఉన్న పిల్లలు ఆయన సలహాలు, సూచనల కోసం 95504 14416 నెంబరులో సంప్రదించవచ్చు.

# కంటి వెలుగు కేంద్రంలోకి కోతులు!

భూపాలపల్లి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమ శిబిరం గదిలోకి వానరాలు చొరబడి బీభత్సం సృష్టించిన సంఘటన మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో వెలుగు జూసింది. ఈ విషయం స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో పడమటిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కొంతమందిని పరీక్షించి శని, ఆదివారాల్లో సెలవు నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది గదికి తాళం వేసి వెళ్లారు. ఆ సమయంలో కిటికీలకు గడియపెట్టడం విస్మరించారు. సెలవు రోజుల్లో కిటికీల నుంచి వానరాలు లోనికి ప్రవేశించి కంటి అద్దాల పెట్టెలను చిందరవందర చేశాయి. వైద్యులు పరీక్షించే పరికరాలను పడవేశాయి. వైద్యాధికారులు, సిబ్బందికి సమాచారమిచ్చినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. విధులకు వచ్చిన వైద్యులు, సిబ్బంది గది తాళాలు తీసి బిత్తరపోయారు. సమాచారం బయటకు పొక్కకుండా వెంటనే శుభ్రం చేయించి సామగ్రి సరిచేశారు. ఈ విషయంపై దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) బాలాజీని వివరణ కోరగా గాలిదుమారానికి ఓ కిటికీ తలుపు తెరుచుకోవడంతో కోతులు లోనికి వెళ్లాయన్నారు. ఎలాంటి నష్టం వాటిల్లలేదని, శిబిరం యథావిధిగా కొనసాగిందన్నారు.

# దగ్గరైన దూరవిద్య!

జనగామ : ఆర్థిక స్తోమత లేక కళాశాలలకు వెళ్లి చదువుకోలేని వారికి, డిగ్రీ పట్టా లేక పదోన్నతి పొందలేకపోతున్న వారికి, ఇతర కారణాలతో కళాశాలలకు వెళ్లలేని విద్యార్థులకు జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ కేంద్రం దారి చూపుతోంది. దూరవిద్య విధానంలో డిగ్రీ చదివిన వారికి రెగ్యులర్ డిగ్రీతో సమానంగా అవకాశాలు ఉండడంతో ఏటా ఇందులో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కల్పనకు దూరవిద్య ధ్రువీకరణ పత్రాలను ఆమోదిస్తుండడంతో చాలా మంది దూరవిద్యపై మొగ్గు చూపుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితమే స్థాపన !

మూడు దశాబ్దాల క్రితం నుంచి దూరవిద్యకు ఆదరణ ఎక్కువే. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు విద్య అందించాలనే సంకల్పంతో 1991లో జనగామలో దూరవిద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో 30 నుంచి 50 వరకు ఉన్న ప్రవేశాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు వందలాది మంది పట్టభద్రులు కాగా పలువురు ఉద్యోగాలు సాధించినట్లు స్థానిక అధ్యయన కేంద్రం అధికారులు తెలిపారు. గతేడాది 285 మంది చేరగా ఈ ఏడాది 300 మందికి పైగా చేరుతారని భావిస్తున్నారు. అప్పటి ఎకనామిక్స్ అధ్యాపకుడు ఎస్.సత్యనారాయణ తొలి కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా ప్రస్తుత కోఆర్డినేటర్‌గా అనగాని శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.

అర్హులు వీరే..!యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొన్ని మార్పులతో దూరవిద్యలో దరఖాస్తులను స్వీకరిస్తోంది. దూరవిద్యలో ప్రవేశం పొందాలంటే 18 ఏళ్లు నిండి, లేదా పదో తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులై, మధ్యలో చదువు ఆపేసిన వారు అర్హులు. 2017-18 విద్యాసంవత్స



రంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారిని దూర డిగ్రీలోకి తీసుకోవాలన్న నిబంధనలు అమలు కానున్నాయి. దూరవిద్యలో పదో తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులైన వారిని ఇందుకు అనర్హులుగా ప్రకటించారు. రెగ్యులర్ విధానంలోనైనా, దూరవిద్యలోనైనా పాలిటెక్నిక్, ఇంటర్ లేదా ఏదైనా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారే ఇందుకు అర్హులని జనగామ అధ్యయన కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

ఉద్యోగావకాశాలు మెండు..

రెగ్యులర్ డిగ్రీ సాధ్యపడని వారు దూరవిద్యను అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఏ ఉద్యోగానికైనా డిగ్రీ ఉత్తీర్ణతను తప్పనిసరి చేస్తుండడంతో పది, ఇంటర్‌లో ఉత్తీర్ణులై ప్రైవేటులో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం దూరవిద్య ద్వారా డిగ్రీ పట్టా పొందుతున్నారు. ఉన్నత ఉద్యోగాల కోసం వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పది, ఇంటర్‌తో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన సైతం దూరవిద్యలో డిగ్రీ పొంది పదోన్నతి పొందుతున్నారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి-అనగాని శ్రీనివాస్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్, జనగామ

రెగ్యులర్ డిగ్రీతో సమానంగా దూరవిద్యకూ అవకాశాలు ఉన్నాయి. ఇంటర్, పాలిటెక్నిక్, ఇతర తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత పొందే అవకాశం ఉంటుంది.

# నిర్వహణ ప్రశ్నార్థకం.. అవస్థలు యథాతథం!

సూర్యాపేట : గ్రామీణ ప్రాంతాల్లో దహన సంస్కారాలు నిర్వహించాలంటే వ్యవసాయ భూములు ఉన్న వారు వారి సొంత స్థలంలో.. లేని వారు చెరువులు, కుంటల వెంట చేపట్టాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వైకుంఠధామాల నిర్మాణాలకు చర్యలు తీసుకొంది. ప్రతి గ్రామం, పురపాలికల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి సుమారు రూ.12.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేశారు. ఏర్పాటు చేసిన తరువాత వాటిని పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీటి నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అంతిమ యాత్రకు అవస్థలు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, 5 పురపాలికలు ఉన్నాయి. స్థలాభావం కారణంగా కొన్ని చోట్ల వైకుంఠధామాలను చెరువులు, కుంటలు ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టారు. వర్షాకాలంలో నీరు చేరి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అంతేకాక వైకుంఠధామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాలు నిర్వహించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైకుంఠధామాల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారుతున్నాయి.

మౌలిక వసతులు కరవు

వైకుంఠధామాల్లో విద్యుత్తు, నీటి సౌకర్యం ఇతర మౌలిక వసతులు కల్పించినప్పటికీ నిర్వహణ లేక నిర్వీర్యం అవుతున్నాయి. వైకుంఠధామాలు పలుచోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీనికి తోడు కొందరు ఆకతాయిలు వీటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. తలుపులు, ఇతర సామగ్రిని తాగిన మత్తులో ధ్వంసం చేస్తున్నారు. వీరి ఆగడాల కారణంగా మరమ్మతుల కోసం అదనంగా నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి.

పర్యవేక్షణ పెంచుతాం: యాదయ్య, డీపీవో, సూర్యాపేట

జిల్లావ్యాప్తంగా నిర్మించిన వైకుంఠధామాల్లో దహన సంస్కారాలు నిర్వహించారు. వీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వైకుంఠధామాల సామగ్రి ధ్వంసం కాకుండా ప్రహరీ, రక్షణ కంచె ఏర్పాటుతోపాటు గ్రామ పోలీస్ అధికారి, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. వీటి ప్రవేశద్వారం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

# వడివడిగా అమృత్ సరోవర్

జగిత్యాల : గ్రామాల్లో నీటి ఎద్దడిని నివారించి భూగర్భ జలాలు పెంపొందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ సరోవర్ పథకం అమలుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాలో నూతనంగా కుంటలు, చెరువులు తవ్వడంతో పాటు చెడి పోయిన వాటికి మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో అమృత్ సరోవర్ పనులు ప్రారంభమయ్యాయి. చిన్న నీటి వనరుల పెంపుపై దృష్టి..జిల్లాలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చిన్న నీటి వనరులు నిలిచి ఉండే స్థలాలు గుర్తించి కొత్తవి నిర్మాణం చేపట్టడం, అదేవిదంగా దెబ్బతిన్న పాత చెరువులు, కట్టలు, తూములు, మత్తడిల మరమ్మతులకు ప్రణాళికను రూపొందించారు. నూతన చెరువులు, కుంటల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించనున్నారు. ఎకరం విస్తీ ర్ణంలో 10 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉం డేలా కుంటల నిర్మాణం జరుపుతున్నారు. జిల్లాలో చాలా చోట్ల ఇప్పటి కే ఇందుకు అవసరమైన పనులు ప్రారంభించారు. త్వరగా పూర్తి చేసేం దు కు చర్యలు వేగవంతం చేస్తున్నారు. పూర్తయిన వాటిపై సర్పంచ్, అధికా రులు ఆగస్టు 15వ తేదీన జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని అంటున్నారు.
జిల్లాలో 75 చెరువులు, కుంటల నిర్మాణం, మరమ్మతులు..
జిల్లా వ్యాప్తంగా 75 చెరువులు, కుంటల నిర్మాణం, మరమ్మతు పనుల ను అమృత్ సరోవర్ పథకం కింద అధికారులు చేపడుతున్నారు.




జిల్లాలో ని 18 మండలాల్లో 75 పనులను చేపట్టనుండగా ఇందులో 29 కొత్తగా చెరువుల, కుంటల నిర్మాణాలు చేయనున్నారు. 46 పాత చెరువులు, కుం టల మరమ్మతుల పనులు చేయడానికి నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 95 ఎకరాల్లో నూతనంగా చెరువులు, కుంటల నిర్మాణాలు జరుగనున్నా యి. జిల్లాలో 9.50 లక్షల క్యూబిక్ మీటర్ల భూగర్భ జలాలు పెరుగను న్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని మల్యాల మండలంలో 8 పాతవి చెరువులు, కుంటల మరమ్మతులు, మెట్‌పల్లిలో 8 మరమ్మతు పనులు, కొడిమ్యాలలో 6 మరమ్మతులు, పెగడపల్లిలో 4 పాతవి, వెల్గటూ రులో 5 పాతవి, ధర్మపురిలో 4 పాతవి, గొల్లపల్లిలో 4 పాతవి, కథలా పూ ర్‌లో 2 కొత్తవి, 4 పాతవి, జగిత్యాల రూరల్‌లో 3 పాతవి, రాయికల్‌లో 6 కొత్తవి, 3 పాతవి, కోరుట్లలో 2 పాతవి, మల్లాపూర్‌లో 4 కొత్తవి, 2 పా తవి, ఇబ్రహీంపట్నంలో 1 కొత్తది, 1 పాతది, జగిత్యాలలో 1 పాతది, సా రంగపూర్‌లో 3 కొత్తవి, 1 పాతది, బీర్‌పూర్‌లో 4 కొత్తవి, బుగ్గారంలో 3 కొత్తవి, మేడిపల్లిలో 6 కొత్తవి చిన్న నీటి వనరుల నిర్మాణాలు, మరమ్మతు పనులు చేపడుతున్నారు. పెరగనున్న భూ గర్భజలాలు...అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లా పలు చెరువులు, కుంటల నిర్మాణాలు, మరమ్మతుకు అధికారులు ప్రతిపాదిం చారు. ఇందుకు అవసర మైన అనుమతులు సైతం లభించాయి. ఇందుకు ఒక్కో దానికి రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. నూతన నిర్మాణాలు, మర మ్మతుల అనంతరం కుంటలు, చెరువుల్లో 9.50 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. ఈ యేడాది ఆగస్టు వరకు పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలున్నాయి. ఆ దిశగా జి ల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు చేస్తున్నారు. జిల్లాలోని మల్యాలలో లక్ష క్యూబిక్ మీటర్లు, మెట్‌పల్లిలో 80 వేలు, కొడిమ్యాలలో 60 వేల, పెగడపల్లిలో 60 వేలు, వెల్గటూరులో 60 వేలు, ధర్మపురిలో 40 వే లు, గొల్లపల్లిలో 40 వేలు, కథలాపూర్‌లో 70 వేలు, జగిత్యాల రూరల్‌లో 30 వేలు, రాయికల్‌లో 1.10 లక్షల క్యూబిక్ మీటర్ల భూగర్భ జలాలు పెరగనున్నట్లు అంచనా వేశారు. కోరుట్లలో 20 వేలు, మల్లాపూర్‌లో 60 వేలు, ఇబ్రహీంపట్నంలో 20 వేలు, జగిత్యాలలో 10 వేలు, సారంగపూర్‌లో 60 వేలు, బీర్‌పూర్‌లో 40 వేలు, బుగ్గారంలో 30 వేలు, మేడిపల్లిలో 60 వేల క్యూబిక్ మీటర్ల భూగర్భ జలాలు పెరుగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. నూతన తవ్వకాలతో పాటు మరమ్మతులు- వినోద్, డీఆర్‌డీవో, జగిత్యాల అమృత్ సరోవర్ పథకం ద్వారా జిల్లాలో నూతనంగా చెరువులు, కుంట లు నిర్మాణాలు చేయడంతో పాటు పాత వాటికి మరమ్మతులకు గాను ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు సైతం లభించా యి. అభివృద్ధి పనులు ప్రారంభించాము. ఆగస్టులోపు పూర్తయ్యే లాచర్య లు తీసుకుంటాము. భూగర్భ జలాలు పెరుగనున్నాయిబాలె శివాజీ, డీఆర్‌డీఏ ఏపీడీ, జగిత్యాలచిన్న నీటి వనరుల నిర్మాణాలు, మరమ్మతులతో రానున్న రోజుల్లో భూ గర్భ జలాలు పెరగనున్నాయి. నీటి ఎద్దడి సమస్యను అమృత్ సరోవర్ పథకం వల్ల నివారించడానికి అవకాశం లభిస్తోంది. పలు పనులను ఈజీఎస్ పథకంలో చేపడుతున్నాము.

## రోగులకు మరిన్ని వైద్య సేవలు

జగిత్యాల : గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మరి న్ని వైద్య సేవలు అందించనున్నట్టు రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు చెప్పారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్‌టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో రెండవ అంతస్థులో 50 పడకల గదులను ప్రారంభించామని తెలిపారు. కింద ఉన్న ఆపరేషన్ థియేటర్, ఆర్థో, సర్జికల్, మెడికల్ వార్డులను పైఅంతస్థులకు తరలించనున్నట్టు, కింద రోగుల కు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. పైవార్డు లో 25బెడ్లు మెడికల్‌కు, సర్జికల్‌కు 40, ఆర్థోకు 25బెడ్లు ఏర్పాటు చేసినట్టు, అంతేకాకుండా ఎమర్జెన్సీ మెడికల్ డిపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎమర్జె న్సీ క్రిటికల్ కేర్ పోస్ట్ ఆపరేటివ్ గదులను కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏదైనా ఎమర్జెన్సీ కేసులు వస్తే చూసే విధంగా ఎక్విప్‌మెంట్, ఆక్సిజన్, మందులకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ ఇన్సెంటివ్ కేర్, నర్సులకు విశాలమైన గదులను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. మరో వారం లోపు ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు ప్రారంభిస్తామని పేర్కొ న్నారు. ఇక్కడికి వచ్చే ఏ ఎమర్జెన్సీ కేసునైనా బయటకు పంపకుండా ప్రొఫెసర్లు, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు, రెసిడెన్సీ డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. త్వరలోనే పారిశుధ్య సిబ్బంది కొరత కూడా తీరుతుందన్నారు. 140మంది వరకు పారిశుధ్యసిబ్బంది నియామకం జరుగుతుందన్నారు. దీని కోసం టెండర్లు కూడా పిలిచారని, డైట్ కాంట్రాక్టు కూడా రద్దు చేశామన్నారు. ఆసుపత్రిలో విశాలంగా ఉండడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్లుదయాల్‌సింగ్, కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎంవోలు ధర్మేందర్, భీష్మా, ప్రొఫెసర్లు రాజు, అనంతబాబు, అశోక్ పాల్గొన్నారు.

# దళితబంధు వేగవంతం



జగిత్యాల : జిల్లాలో దళితబంధు పథకం అమలుపై అధికారులు వేగం పెంచనున్నారు. రెండో విడత దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అధికారులు ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో తొలివిడత దళిత బంధు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇటీవల ఆస్తుల పంపిణీ కార్య క్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించారు. ప్రధానంగా వాహనాలను ఎంపిక చేసుకున్న లబ్ధిదారు లకు వాటిని పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.పది లక్షల విలువ చేసే ఆస్తులను పంపిణీ చేస్తున్నారు.
నియోజకవర్గానికి 1500 యూనిట్ల కేటాయింపులుజిల్లాలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెండో విడత 1500 దళితబంధు యూనిట్లను కేటాయించి పంపిణీ చేయడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో యూనిట్ల ఎంపికకు అవసరమైన లబ్ధిదారులను గుర్తించడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాలకు ఒక్కొక్క సెగ్మెంట్‌కు 1500 చొప్పున జిల్లాకు 4,500 యూనిట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరు కానున్నాయి. దీంతో పాటు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జగిత్యాల జిల్లాలోని మల్యాల, కొడిమ్యాల మండలాలు, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి, వేములవాడ మండలాలకు సైతం అదనంగా పలు యూనిట్లు అందే అవకాశాలున్నాయి. వేములవాడ, చొప్పదండి ఎమ్మెల్యేలు జగిత్యాల జిల్లాకు చెందిన అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు అందిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.ఎమ్మెల్యేల నిర్ణయమే ఫైనల్‌దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపిక నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ప్రభుత్వం అప్పగించింది. ఎమ్మెల్యేలు తీసుకున్న నిర్ణయమే తుదిగా ఉండనుంది. తొలి విడత దళిత బంధు పథకంలో సైతం ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన లబ్ధిదారులకే అధికారులు యూనిట్ల కేటాయింపులు జరిపారు. మలి విడతలోనూ ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వ్యక్తులకే యూనిట్లను అందించనున్నారు. దీంతో ఎమ్మెల్యేలు లబ్ధిదారుల ఎంపికపై దృష్టి సారించారు. నియోజక వర్గంలోని అన్ని మండలాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అన్ని వర్గాలతో మమేకమై జాబితా రూపొందించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ధర్మపురి నియోజకవర్గ లబ్ధిదారుల జాబితాను మంత్రి కొప్పుల ఈశ్వర్, కోరుట్ల నియోజకవర్గం జాబితా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల నియోజకవర్గ జాబితా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఖరారు చేయనున్నారు. అదే విధంగా వేములవాడ, చొప్పదండి ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్ బాబు, సుంకె రవి శంకర్ లబ్ధిదారుల జాబితా రూపొందించడంపై దృష్టి సారించారు. మే నెలాఖరులో ప్రతి నియోజకవర్గంలో 300 మందితో కూడిన జాబితాను అందించాలని ఎమ్మెల్యేలను అధికారులు కోరుతున్నారు. ఎమ్మెల్యేలు లబిదారుల జాబితాను అందించగానే తదుపరి కార్యాచరణను పూర్తి చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో రెండో విడత దళిత బంధు పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్కో నియోజకవర్గానికి 1500 యూనిట్లు పంపిణీ చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. తొలివిడతలో 345 మంది లబ్ధిదారులుజిల్లాలో తొలిసారిగా అమలు చేసిన దళితబంధు జాబితాలో 345 మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించారు. ఇందులో ధర్మపురి నియోజకవర్గంలో 81 మంది, జగిత్యాలలో 100, కోరుట్లలో 100, చొప్పదండి నియోజకవర్గంలో 32, వేములవాడ నియోజకవర్గంలో 30 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. 345 మంది లబ్ధిదారుల్లో 91 మంది ట్రాక్టర్లు, 48 మంది ఇతర వ్యవసాయ వాహనాల యూనిట్లను ఎంపిక చేసుకున్నారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో 89 మంది, రిటైల్ రంగంలో 54 మంది, సేవా రంగంలో 40 మంది, మాన్యుఫాక్చర్ రంగంలో 23 మంది వివిధ రకాల యూనిట్లను ఎంపిక చేసుకున్నారు. వీరిలో ట్రాన్స్‌పోర్టు, వ్యవసాయ రంగంలో ఎంపిక చేసుకున్న యూనిట్లను ఇటీవల జగిత్యాలలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, సుంకె రవిశంకర్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిగిలిన యూనిట్లను పంపిణీ చేయడానికి అధికారుల ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ నెలాఖరులోపు సెగ్మెంట్‌కు 300 ప్రతిపాదనలు ఆశిస్తున్నాం- గుగులోతు రవి నాయక్, కలెక్టర్, జగిత్యాలప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 1500 మంది లబ్ధిదారులకు దళితబంధు పథకం అమలు చేయనున్నాము. ఈ నెలాఖరు వరకు కనీసం 300 మంది పేర్లు ప్రతిపాదించాలని ఎమ్మెల్యేలను కోరాలని సంబంధిత అధికారులకు సూచించాము.రెండో విడత దళితబంధుపై దృష్టి - లక్ష్మీనారాయణ, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, జగిత్యాలజిల్లాలో తొలివిడత దళితబంధు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పనులు పూర్తి చేస్తున్నాము. ఇదే సమయంలో రెండో విడత దళితబంధు పథకం కింద లబ్ధిదారుల జాబితా సేకరణపై దృష్టి సారించాము. ప్రజాప్రతినిధుల వద్ద నుంచి జాబితా అందాల్సి ఉంది.

## కుడి చెరువు రిజర్వాయర్‌గా మారేదెన్నడో..?

జగిత్యాల : పట్టణంలోని కుడి చెరువు రిజర్వాయర్‌గా మార్చే ప్రతిపాదన కాగితాలకే పరిమితం అయ్యింది. దశాబ్దాల కల నెరవేరడం లేదు. పట్టణానికి ఆనుకొని ఉన్న ఈ చెరువును కాదని మండలంలోని రెవెల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాగా, ఈ చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. 40 ఏళ్ల కిందటే కుడి చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని ప్రతిపాదించారు. చెరువు శిఖం భూమి నుంచి కాకతీయ కాలువ పోతుండగా, తూమును ఏర్పాటు చేసి నీటిని చెరువులోకి మళ్లించాలని ప్రతిపాదించారు. చెరువును రిజర్వాయర్‌గా మార్చితే అదనపు ఆయకట్టు సాగులోకి రావడంతోపాటు పట్టణంలో భూగర్భ నీటి మట్టం బాగా పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చెరువు నిండినా ఆయకట్టు కింద రెండు పంటల సాగు కు నీరు అందడం లేదు. అతి తక్కువ ఖర్చుతో ఈ చెరువును రిజర్వాయర్‌గా మార్చే అవకాశం ఉంది. చెరువుకు కింద 700 ఎకరాల ఆయకట్టు ఉండగా రిజర్వాయర్‌గా మార్చితే మరో 500 ఎకరాల ఆయకట్టు పెరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అడుగంటుతున్న భూగర్భజలాలు

కరీంనగర్ : వర్షాకాలంలో పైకి ఉబికి వచ్చిన భూగర్భజలాలు రోహిణికార్తె వచ్చేసరికి పాతాళానికి పడిపోతున్నాయి. రోజురోజుకు భూగర్భ జలాలు పడిపోతుండడంతో బోరుబావులన్నీ వట్టిపోతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి ప్రజలు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఏప్రిల్ నెలలో జిల్లాలో గరిష్టంగా 23.53 మీటర్ల లోతుకు, సగటున 8.16 మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలోని గంగాధర మండలంలో భూగర్భజలాల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ మండలంలో జనవరిలో 14.87 మీటర్ల లోతున నీళు లభించగా, ఫిబ్రవరిలో 16.28 మీటర్ల లోతుకు, మార్చిలో 19.26 మీటర్ల లోతుకు, ఏప్రిల్‌లో 23.53 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. అలాగే చొప్పదండి మండలంలో 13.16 మీటర్లు, సైదాపూర్ మండలంలో 12.36 మీటర్లు, తిమ్మాపూర్ మండలంలో 11.33 మీటర్లు, చిగురుమామిడి మండలంలో 11.03 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోవడంతో అక్కడ బోరుబావులు త్వరితగతిన ఎండిపోతున్నాయి. వరి కోతలు పూర్తయినా భూగర్భజలాలు గతేడాదికన్నా మరింత లోతుకు వెళ్లడం జిల్లాలో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయని స్పష్టమవుతున్నది. గత సంవత్సరం ఏప్రిల్‌లో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొనగా ఈసారి మరింత ఎక్కువ తీవ్రత ఉన్నది.
రానున్న రోజుల్లో మరింత లోతుకు భూగర్భ జలాలు
ప్రస్తుతం జిల్లాలోని జమ్మికుంట మండలంలో 9.72, ఇల్లందకుంటలో 7.40 మీటర్లు, గన్నేరువరంలో 5.78 మీటర్లు, హుజూరాబాద్‌లో 5.22 మీటర్లు, శంకరపట్నంలో 5 మీటర్లు, కరీంనగర్ మండలంలో 9.02, కరీంనగర్ రూరల్ మండలంలో 3.42 మీటర్లు, మానకొండూర్‌లో 1.80 మీటర్లు, రామడుగులో 8.43 మీటర్లు, తిమ్మాపూర్‌లో 6.15 మీటర్లు, వీణవంకలో 3.90 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో ఎండలు మరింత తీవ్రమయ్యాయి. ఎండ 40 డిగ్రీల సెల్సియస్



నమోదవుతున్న దాని తీవ్రతమాత్రం 45 నుంచి 48 సెల్సియస్ ఉన్నప్పటి ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంటున్నది. ఎండలు మరింత పెరగడంతో భూగర్భ జలాలు వచ్చే 15 రోజుల్లో గరిష్ట స్థాయికి పడిపోవచ్చని, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బోరుబావుల కింద సేద్యం చేసేవారు వరినార్లు పోసుకోవడానికి ఆలస్యం అవుతుందని భావిస్తున్నారు. మృగశిర ప్రారంభం తర్వాత వర్షాలు కురిస్తేనే భూగర్భ జలాలు పెరిగి నార్లు పోసుకోవడానికి వీలవుతుంది. నైరుతీ రుతుపవనాలు అండమాన్ దీవులకు వచ్చి ఆ తర్వాత కదలిక లేకపోవడంతో కేరళకు చేరడానికి ఎన్ని రోజులు పడుతుందో ఆ తర్వాత అవి దేశవ్యాప్తంగా ఎప్పుడు విస్తరిస్తాయో ఇప్పుడిప్పుడే తెలియడం లేదు. దీంతో రాబోయే రోజుల్లో నీటి కటకట తప్పకపోవచ్చు. మిషన్ భగీరథ ఉన్న గ్రామాల్లో సమస్య తీవ్రత పెద్దగా లేకపోయినా ఆ పథకం పూర్తికాని జనావాసాల్లో, మరమ్మతులు జరుగుతున్న గ్రామాల్లో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రధానంగా పట్టణ, మండల కేంద్రాల్లో బోరుబావులు వినియోగించుకునేవారు నీటి తీవ్రతను ఎక్కువగా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# యంత్రాల కోత.. మేత కొరత

ఖమ్మం : పశుగ్రాసం కోసం మూగజీవాలు అల్లడుతున్నాయి. గుప్పెడు మేతకోసం పోటీ పడుతున్నాయి. ఇంటి నుంచి మేతకు వెళ్లిన పశువులకు గ్రాసం దొరకక బక్కచిక్కి పోతున్నాయి. దీంతో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. గతంలో పక్వానికి వచ్చిన వరి పంటను కూలీలు కోసేవారు. ధాన్యాన్ని నూర్చాక వరిగడ్డిని కట్టలుగా కట్టేవారు. రైతులు వాటిని గడ్డివాములుగా పేర్చేవారు. కరువు కాటకాలు ఏర్పడినా పశువులకు అంతగా గ్రాసం కొరత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం కూలీల కొరత, దానికి తోడు యంత్రాల వినియోగం పెరగడంతో గ్రాసం కొరత ఏర్పడుతోంది. యంత్రాలు కోయడం వల్ల చాలినంత గడ్డి లభ్యం అవడం లేదు. ఎక్కువగా వరి సాగుజిల్లాలో వరి పంటను రైతులు సాగు చేస్తుంటారు. ఇక్కడ రైతులు సాగునీరు ఎక్కువగా ఉండటంతో వరి సాగు విస్తారంగా సాగవుతుంది. దిగుబడులు ఎక్కువగా రావడంతో రైతులు ధాన్యం పంటను సాగుచేస్తారు. నానాటికీ కూలీల కొరత ఎక్కువ అవడంతో యంత్రాలతో రైతులు తమ పంటను కోయిస్తున్నారు. ఒకవేళ కూలీలు దొరికినా ఎకరంలో ధాన్యం నూర్పిడి చేసినందుకు రూ. తొమ్మిదివేలు తీసుకుంటున్నారు. అసలే అంతంతమాత్రంగా దిగుబడి వస్తుండంతో రైతులు కూలీలకు అంత చెల్లించలేక యంత్రాలతో వరి కోయించేందుకు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో అయితే ఎకరం కోసినందుకు టైర్ల మిషన్‌కు రూ, 2,500 నుంచి రూ. మూడు వేలు



ఖర్చవుతోంది. చైన్ మిషన్‌తో గంటకు రూ, నాలుగు వేలు ఖర్చవుతోంది. దీంతో మూగజీవాలకు గ్రాసం కొరత ఎక్కువగా ఉంటుంది. పశువులను అమ్ముకుంటున్నారుఒకప్పుడు పొలాలను నాగళ్లతో దున్నేవారు. ఇందుకు పశువులను ఉపయోగించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పశువుల స్థానంలో ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు పశువుల వినియోగం కూడా తగ్గింది. కొందరయితే పొలంలో దమ్ము చేసే సమయంలో గొర్రు తోలేందుకు కూడా ట్రాక్టర్‌నే వినియోగిస్తున్నారు. దీనివల్ల పశువుల వినియోగడం దాదాపు తగ్గడం, యంత్రాలతో వరిని కోయిస్తుండటంతో గ్రామంలో రైతు చక్రం దారి తప్పింది. పశువులంటే మక్కువ ఉన్న రైతులు కూడా ప్రస్తుతం వాటికి సరిపడా గ్రాసం అందించలేక అమ్ముకుంటున్నారు. కరకగూడెం ప్రాంతంలో ఒకప్పుడు వేసవి వచ్చిందంటే చాలు పొలాల నిండా పశువులే కన్పించేవి. కానీ ప్రస్తుతం అంతంతమాత్రంగా ఉన్న పశువులతో ఒకప్పటి సందడి వాతావరణం కళ తప్పింది. పశువులు ఎక్కువగా ఉండటంతో అవి గడ్డి తిని వేసే పెడతో పొలాలన్నీ సారవంతమయ్యేవి. పంటలు కూడా బాగా పండేవి. కానీ నేడు ఆ స్థాయిలో పశువులు లేకపోవడంతో పొలాలన్నీ నిస్సారవమవుతున్నాయి. భూమిలో అంతగా జవసత్వం లేకపోవడంతో పంటల దిగుబడి కూడా అంతంతమాత్రంగా ఉంటోంది.

## మరోసారి 'నాక్' కోసం..

భద్రాచలం : భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేషనల్ అసెస్‌మెంటు అక్రిడిటేషన్ కౌన్సి ల్(నాక్) గుర్తింపుపై మరోసారి దృష్టి సారించింది. ఎందరో ఆణిముత్యాల్లాంటి విద్యార్థులను అందించిన ఈ కళాశాల మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో నాక్ గుర్తింపు ఎంతో కీలకం కానుంది. భద్రాచలం ప్రభు త్వ డిగ్రీ కళాశాలకు 2016లో నాక్ బీ గ్రేడ్ గుర్తింపు సాధించింది. ఐదేళ్ల కాలపరిమితి పూర్తికావడంతో మరో సారి గుర్తింపు కోసం డిగ్రీ కళాశాల అధికారులు కసరత్తు చేపడుతున్నారు. కళాశాలలో ప్రస్తుతం 1435 మంది విద్యార్థులు డిగ్రీ, పీజీలో విద్యనభ్యసిస్తున్నారు.
ముచ్చటగా మూడోసారి ప్రయత్నంభద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1980లో ఏర్పాటు చేయగా తొలిసారిగా 2007లో ఐచ్ఛికంగా నాక్ గుర్తింపు కోసం ప్రయత్నించి బీ గ్రేడ్‌ను సాధించింది. ఐదేళ్ల అనం తరం మరోసారి నాక్ గుర్తింపు కోసం వెళ్లాల్సి ఉండగా అనివార్య కారణాలతో అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలో 2016లో నాక్ గుర్తింపు కోసం ప్రయత్నించి బీ గ్రేడ్‌ను సా? దించింది. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నప్పటికీ మైదాన ప్రాంత కళాశాలకు దీటుగా ఇక్కడ బోధన సాగుతుండటంతో ఫలి తాలు సంతృప్తికరంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో మరోసారి నాక్ గుర్తింపు కోసం కసరత్తు చేపట్టిన అధికా రులు ఇందుకు అవసరమైన వాటిన్నింటిని సమకూ ర్చుకునే దిశగా చర్యలు చేపడుతున్నారు. అడ్డంకులను అధిగమిస్తేనే..భద్రాచలం డిగ్రీ కళాశాలలో బోధన సిబ్బంది పోస్టులు 31 మంజూరు కాగా ఇందులో ఏడుగురు రెగ్యులరు, 13 మంది అతిథి అధ్యాపకులుగా, ఎనిమిదిమంది కాంట్రాక్టు అధ్యాపకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రిన్సిపాల్ పోస్టు మూడేళ్లగా ఖాళీగా ఉండటంతో కళాశా ల అధ్యాపకులు భద్రయ్య పూర్తిస్థాయి అదనపు బాధ్యత లు నిర్వహిస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉండగా బోదనేతర సిబ్బంది కో సం 21 పోస్టులు మంజూరు కాగా ఏడుగురు మాత్రమే ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. కాగా డిగ్రీ కళాశాలకు ప్ర త్యేకమైన ఆటస్థలం లేకపోవడం ప్రధాన లోటుగా కనిపి స్తోంది. నాక్ బృందం పరిశీలన సమయంలో ఈ అంశం ఎంతో కీలకమైనప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో భద్రాచలంలో ప్రభుత్వ స్థలం ఏమీ లేకపోవడంతో రెవెన్యూ అధికారులు అశక్తత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 2015లో కొనుగోలు చేసిన 40 కంప్యూటర్లలో కొన్నింటిలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అ ప్‌డేట్ చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఫలితాలు, ప్రతిభ చాటడటంలో మిన్నడిగ్రీ కళాశాల విద్యార్థులు ఫలితాల సాధనలో, అలాగే ప్రతిభ చాటడంలో ఇతరుల కంటే మిన్నగా వ్యవహరిస్తున్నారు. 2016,-17, 2017-18లో కామర్స్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఒక్కో విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. 2017-18లో ఫిజిక్స్ విభాగంలో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో రాష్ట్రస్థాయిలో ప్ర?థమస్థానం, 2018-19లో జువాలజీలో ప్రథమస్థానం, 2020-21లో ఎకనామిక్స్‌లో స్టూడెంట్‌స్టడీ ప్రాజెక్టులో కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించడం విశేషం. రెండు రోజుల క్రితమే ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ కళాశాల అధికారులు, విద్యార్థులను ప్రశంసిస్తూ రూ.38 వేల నగ దును విద్యార్థికి అందజేశారు. విలువిద్య, కుస్తీ పోటీల్లో సైతం కళాశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతి భ చాటారు. ఇదిలా ఉండగా కళాశాల విద్యార్థులు ప్రతిభ ఆధారంగా రాష్ట్రీయ ఉచ్ఛితార్ శిక్షాభయాన్(రూసా) నుం చి గత ఏడాది 60 కంప్యూటర్లను అందజేశారు. ఇదిలా ఉండగా విద్యార్థుల అవసరాలకు మరో 50 అధునాతన కంప్యూటర్లు కావాల్సి ఉందని ఉన్నత విద్యాశాఖ కమి షనర్‌కు కళాశాల అధికారులు ప్రతిపాదనలు పంపారు.జూన్‌లో నివేదిక సమర్పణడిగ్రీ కళాశాల నాక్ గుర్తింపు కోసం మరోసారి ప్రయత్ని స్తున్న క్రమంలో జూన్ మొదటివారంలో నివేదికను సమ ర్పించనున్నారు. గతంలో నాక్ లిఖితపూర్వకంగా నివేది కలు సమర్పించగా తాజాగా ఆన్‌లైన్ ద్వారా నివేదికలు సమర్పించాలని సూచించింది. ఈ క్రమంలో 45 రోజుల్లో నివేదికను ఆన్‌లైన్ ద్వారా సమర్పించనున్నారు. ఈ క్ర మంలో 1980 నుంచి నేటి వరకు డిగ్రీ కళాశాలలో విద్య నభ్యసించినపూర్వ విద్యార్థుల సంఘం సన్నాహక సమా వేశాన్ని శుక్రవారం కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించనున్నారు. కళాశాల నివేదిక సమర్పణ అనంతరం నాక్ అధికారులు పరిశీలించనున్నారు. ఈ క్రమంలో అధికారు లు కళాశాల పట్ల విద్యార్థుల అభిప్రాయాలను నేరుగా సేకరించనున్నారు. కళాశాల అధికారులు పంపిన డిజిటల్ వీడియో వెరిఫికేషన్‌ను నిర్ధారించనున్నారు. ఈసారి ఏం గ్రేడ్ సాధిస్తాండి.



# భగీరథ మహర్షికి సీఎం వైయస్ జగన్ నివాళి

తాడేపల్లి: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఏపీ సగర, ఉప్పర వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ జి.రమణమ్మ, గిద్దలూరు వైయస్ఆర్‌సీపీ పరిశీలకుడు బంగారు శీనయ్య హాజరయ్యారు.

# కాంగ్రెస్ వారంటీ ముగిసింది..

## ఇక మీకేం గ్యారంటీ ఇస్తుంది?: మోదీ విమర్శలు



బెంగళూరు: వచ్చే నెలలో జరగనున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం అన్ని పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాజాగా ప్రధాని నరేంద్రమోదీ భాజపా కార్యకర్తలతో వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా భాజపా గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. అలాగే కాంగ్రెస్‌కు వారంటీ ముగిసిందని వ్యాఖ్యానించారు. 'కమల దళం చేస్తోన్న కృషి వల్ల కర్ణాటకలో భాజపా రికార్డు సీట్లు సొంతం చేసుకుంటుంది. అలాగే రెండు రోజుల తర్వాత మీ మధ్యకు వస్తాను. కన్నడ ప్రజల ఆశీస్సులు తీసుకుంటాను. ఇక్కడ మీకో విషయం స్పష్టం చేయదల్చుకున్నా.. అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మాత్రమే వస్తే సరిపోదు. అది పూర్తి మెజార్టీతో ఉండాలి. దేశంలో మొదటి ఎయిమ్స్ 1956లో ప్రారంభమైంది. కానీ, ఆ తర్వాతది ఎప్పుడు వచ్చింది..? దాని గురించి కాంగ్రెస్ ఏమీ మాట్లాడదు. మేం అధికారంలోకి వచ్చాం. ఎయిమ్స్ సంఖ్యను మూడు రెట్లు పెంచాం. ఇప్పుడు చెప్పండి డబుల్ ఇంజిన్ వల్ల లాభమా..? నష్టమా..? కాంగ్రెస్ అంటేనే ఒక అబద్ధపు గ్యారంటీ. కాంగ్రెస్ ఉంటే అవినీతికి గ్యారంటీ. ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ఉంది. ఆ పార్టీ వారంటీ ముగిసింది' అంటూ మోదీ విమర్శలు గుప్పించారు. 50 లక్షల మంది భాజపా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

**అమిత్ షాపై కాంగ్రెస్ ఫిర్యాదు..** కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటాయంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆ పార్టీ తన ఫిర్యాదులో పేర్కొంది.




హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దయింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. నేడు తీర్పు వెలువరించింది. మే 5లోపు సీబీఐకి లొంగిపోవాలని ఎర్ర గంగిరెడ్డిని కోర్టు ఆదేశించింది. లొంగని పక్షంలో ఆయన్ను అదుపులోకి తీసుకోవాలని సీబీఐకి సూచించింది.

**విచారణలో వాదనలు ఇలా.. :** వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఎర్ర గంగిరెడ్డి బయట ఉండటం వల్ల దర్యాప్తులో సహకరించడానికి ప్రజలు ఎవరూ ముందుకు రావడం లేదని సీబీఐ బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఆయన వెనుక రాజకీయ ప్రముఖులు ఉండటంతో ప్రజల్లో భయం ఉందని తెలిపింది. నిర్దిష్ట గడువులోగా అభియోగపత్రం దాఖలు చేయకపోవడంతో ఎర్ర గంగిరెడ్డికి మంజూరైన చట్టపరమైన బెయిలును రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ చిల్లకూరు సుమలత విచారణ చేపట్టారు. సీబీఐ తరఫు న్యాయవాది ఎం.నాగేందర్ వాదనలు వినిపిస్తూ.. బెయిలును సమర్థిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. దాని ఆధారంగా వాదనలు చెప్పడం సరికాదన్నారు. ఏ కారణాల మీద ఎర్రగంగిరెడ్డి బెయిలు రద్దు కోరుతున్నారని న్యాయమూర్తి ప్రశ్నించారు. వివేకా హత్య పెద్ద కుట్ర అని, పథక రచన, అమలు అంతా ఎర్ర గంగిరెడ్డే చేశారని సీబీఐ తరఫు న్యాయవాది చెప్పారు.

ఆయన బయట ఉంటే ఇతరులు ఎవరూ దర్యాప్తునకు సహకరించరన్నారు. సాధారణ బెయిలు, మెరిట్ ఆధారంగా బెయిలు మంజూరు చేయడం కాకుండా, చట్టపరమైన బెయిలును పొందినప్పుడు కేసు పూర్వాపరాలు, తీవ్రత, నిందితుడి పాత్రను పరిగణనలోకి తీసుకుని దాన్ని రద్దు చేయవచ్చని సుప్రీంకోర్టు కొత్తగా తీర్పిచ్చిందని సీబీఐ న్యాయవాది చెప్పారు. అందువల్ల గతంలో చెప్పిన తీర్పుల ఆధారంగా ఇందులో వాదనలు సరికాదన్నారు. ఎర్ర గంగిరెడ్డి బెయిలు పిటిషన్ సందర్భంగా సిట్ కౌంటర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నారని, అసలు సిట్ సరిగా పనిచేయడం లేదని ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. అది సరిగా పనిచేయకపోవడం వల్లనే సీబీఐ దర్యాప్తు చేస్తోందన్నారు. సిట్ కౌంటర్‌ను పరిగణనలోకి తీసుకోవడం సరికాదన్నారు. స్థానిక పోలీసులు ఏడాదిపాటు దర్యాప్తును ముందుకు తీసుకెళ్లలేదన్నారు. గూగుల్ టేకౌట్ వంటి సాంకేతిక ఆధారాలున్నాయని, గంగిరెడ్డి బెయిలును రద్దు చేయాలని కోరారు.

# ఏపీ ప్రభుత్వానికి గోల్డ్ అవార్డు అందజేసిన స్కోచ్ సంస్థ

## అధికారులను అభినందించిన సీఎం వైయస్ జగన్



తాడేపల్లి: పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు అందించడంతో పాటు ఆ రుణాలను సద్వినియోగం చేసుకుని, సకాలంలో తిరిగి చెల్లించడంలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ రూపాల్లో అందజేస్తున్న సహాయ సహకారాలకు గాను ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ గోల్డ్ అవార్డు అందజేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న స్త్రీ నిధి సంస్థ వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి పొదుపు సంఘాల మహిళలకు సులభ విధానంలో రుణాలు అందజేస్తున్నందుకు స్త్రీ నిధి సంస్థ స్కోచ్ అవార్డు దక్కించుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్.జగన్‌కు అధికారులు అవార్డులు చూపించారు. అధికారులను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అభినంచారు.

# కర్ణాటకలో ప్రియాంక హవా.. కాంగ్రెస్కు ఊపు తెచ్చేనా?



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలోకి పార్టీ వారసురాలు.. ప్రియాంక గాంధీని రంగంలోకి దింపింది. ఆయన వస్తూ వస్తూనే.. పిడుగుల లాంటి విమర్శలతో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని బీజేపీ దోచేస్తోందని.. ఇప్పటికే లక్షన్నర కోట్ల రూపాయలు దోపిడీ చేశారని.. ఈ సొమ్ముతో ఇతర రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొంటున్నారని కూడా ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతేకాదు.. బీజేపీ నేతలను 40 పర్సంట్ కమీషన్ నేతలు అంటూ ఎదురు దాడి చేశారు. ఇలా.. తొలి రోజే ..ప్రియాంక విరుచుకుపడడంతో కాంగ్రెస్ లో నూతనోత్సాహం కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున మల్లికార్జున ఖర్గే రాహుల్గాంధీలు ప్రచారం చేస్తున్నారు. అదేసమయంలో ప్రియాంక వచ్చారు. ఇక బీజేపీ తరఫున అగ్రనేతలు.. నడ్డా అమిత్ షా వంటివారు ప్రచారం చేస్తున్నారు. ఇక ప్రధాని మోడీ షెడ్యూల్ కూడా త్వరలోనే ఖరారు కానుంది. ఆయన కూడా వరుసగా ఐదు రోజుల పాటు ప్రచారం చేయనున్నట్టు సమాచారం. ఈక్రమంలో కాంగ్రెస్ నుంచి మరింత మంది రంగంలోకి దిగే అవకాశం ఉందని అంటున్నారు పార్టీ నాయకులు.. సోనియాగాంధీ కూడా.. బెంగళూరులో నిర్వహించే కార్యక్రమంలోను.. మైసూర్లో రోడ్ షోకు హాజరవుతారని తెలుస్తోంది. ఇదిలావుంటే ప్రియాంక గాంధీ విమర్శలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికలు మోడీని చూసి కాదని.. ప్రజల సమస్యలు కర్ణాటక అభివృద్ధి వంటి వాటి చుట్టూనే సాగుతాయని ఆమె చెప్పడం.. సెంటిమెంటు పరంగా కన్నడిగులకు నాటుకుందని విశ్లేషణలు వస్తున్నాయి.

# జగన్ ట్రాప్‌లో టీడీపీ పడినట్లేనా...?



అమరావతి : విశాఖ పాలనా రాజధానిగా చేసుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పదే పదే చెబుతూ వస్తున్నారు. తాజాగా ఆయన శ్రీకాకుళం టూర్ లో కూడా అదే మాట అన్నారు. సెప్టెంబర్ నుంచి తాను విశాఖలో కాపురం ఉంటాను అని చెప్పుకొచ్చారు. అధికార వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానుల ప్రతిపాదన చేశామని చెప్పారు. సీఎం జగన్ ఇలా ప్రకటించారో లేదో దాని మీద టీడీపీ జనసేనల నుంచి విమర్శలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి జగన్ డైవర్షన్ పాలిటిక్స్ లో ఆరితేరిపోయారని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. ఒక వైపు వివేకా హత్య కేసులో వరస అరెస్టులు అవుతూంటే దాని నుంచి దృష్టిని మార్చడానికి ఆయన విశాఖ రాజధాని అంటున్నారని అన్నారు. కోర్టుని కూడా ధిక్కరించి మాట్లాడుతారా అని టీడీపీ నేతలు మండిపడుతునారు. మరో టీడీపీ మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు అయితే విశాఖలో నివాసం కాదు జగన్ సీబీఐ ఎక్కడ నివాసం ఉండాలో చెబుతుంది అని హార్ష్ కామెంట్స్ చేశారు. 2024 తరువాత ఎటూ వైసీపీ ఓడిపోతుందని అందువల్ల జగన్ మీద ఇప్పటికే కేసులు అనేకం ఉన్నాయని వాటితో పాటు మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సీబీఐ దీనికి జవాబు చెబుతుందని అన్నారు. దీని మీద మంత్రి గుడివాడ అమరనాథ్ మండిపడ్డారు. జగన్ మంచి ఉద్దేశ్యంతో రాజధాని విశాఖ అంటే టీడీపీ జనసేన విమర్శలు చేయడమేంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా సౌలభ్యం కోసం విశాఖ రాజధాని అని జగన్ చెప్పారని దాని మీద మాట్లాడాలని అన్నారు. విశాఖ రాజధానికి టీడీపీ జనసేన అనుకూలమా కాదా ఎస్ ఆర్ నో అన్న ఒకే ఒక్క మాట చెప్పండి అది చాలు అని గుడివాడ అంటున్నారు. వేయి మాటలు సెటైర్లు విమర్శలు ఎందుకు అని ఆయన వారిని తనదైన మాటలతో అటాక్ చేశారు. విశాఖ రాజధాని అన్నది కీలకమైన అంశమని దాని మీద ముందు మాట్లాడాలని తమ పార్టీ అభిప్రాయం ఏంటో చెప్పేసిన తరువాత ఇతర విషయాలు మాట్లాడవచ్చు అని తాము కూడా స్వాగతిస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి ఎక్కడ నుంచి అయినా కూర్చుని పాలించవచ్చునని దాన్ని ఎవరూ అడ్డుకోలేరని గుడివాడ అన్నారు విశాఖ నుంచి సీఎం జగన్ పాలిస్తాను అంటే ప్రతిపక్షాలకు ఉలుకు ఎందుకు అని ఆయన నిలదీస్తున్నారు. విశాఖ పాలనరాజధానిని ఎద్దేవా చేస్తున్న తెలుగుదేశం నాయకులు చంద్రబాబు కూడా చూస్తూండగానే జగన్ విశాఖ వస్తారని పరిపాలనా యంత్రాంగం కూడా విశాఖకు వస్తుందని గుడివాడ చెప్పారు. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్రాలో తెలుగుదేశం పాలనలో అభివృద్ధి ఎపుడైనా జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో ఎన్నో కార్యక్రమాలకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దాని మీద చర్చకు సిద్ధమని గుడివాడ అంటున్నారు. అచ్చెన్నాయుడు మంత్రిగా తన సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని నిందించారు.

# 200 యూట్యూబ్ ఛానెల్లు పెట్టిన బీజేపీ..ప్రచారం పీక్!



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను ప్రాణ ప్రదంగా భావిస్తున్న బీజేపీ ఏ చిన్న అవకాశాన్నీ వదులు కోవడం లేదు. ఇంకా చెప్పాలంటే.. అవకాశాలను వెతికి మరీ పట్టుకుని ప్రజల్లోకి వెళ్తోంది. ఈ క్రమంలో కొత్తగా 200 యూట్యూబ్ ఛానెల్లను ఆ పార్టీ ప్రారంభించింది. స్థానికంగా మొత్తం 224 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక్కొక్క చానల్ చొప్పున ప్రారంభించారు. ఈ యూట్యూబ్ ఛానెళ్లు ఆయా నియోజకవర్గాల్లో బలంగా ప్రచారం చేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థుల తరఫు న ప్రచారాన్ని దంచి కొడుతున్నాయి. అంతేకాదు.. ప్రజల మధ్యకు కూడా వెళ్తున్నాయి. ప్రజలతో మమేకం అవుతున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి గుణగణాలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రధాని మోడీ చేసిన అభివృద్ధిని దంచి కొడుతున్నారు. బీజేపీ తరఫున ఉన్న అభ్యర్థులపై ప్రజల అభిప్రాయం తెలుసుకుం టున్నా రు. ప్రతియూట్యూబ్ ఛానెల్ లింకును అప్పటికప్పుడే.. వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు.

వాటిలో కొన్ని ప్రత్య క్ష ప్రసారాలు కూడా ఇచ్చేస్తున్నాయి. నిరంతరాయంగా వార్తలు ప్రసారం చేస్తున్నాయి. మొత్తం 200 ఛానెళ్లను అభ్యర్థులే ఏర్పాటు చేసుకునేలా బీజేపీ ఆదేశించింది. దీనిలో చాలా వరకు ఇప్పటికే పని ప్రారంభించగా.. ప్రస్తుతం కర్ణాటకలోనే ఉన్న అమిత్షా .. తాజాగా మిగిలిన 40 ఛానెళ్లను బటన్ నొక్కి ప్రారంభించారు. మరి ఈ ప్రచారం ఏమేరకు బీజేపీకి కలిసి వస్తుందో చూడాలి. కాంగ్రెస్ ఈవిషయంలో వెనుక బడిందనే చెప్పాలి.

# యువనేత లోకేష్ ఎదుట టమోటా రైతు ఆవేదన




కర్నూలు: టీడీపీ యువనేత నారా లోకేష్ తన యువగళం పాదయాత్ర 82వ రోజు కొనసాగుతోంది. గురువారం ఉదయం మంత్రాలయం నియోజవర్గం మాధవరం విడిది కేంద్రం నుంచి లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గం మాధవరం శివార్లలో మహిళా రైతు సిద్దాలింగమ్మ యువనేతను కలిసి టమోటా పంటను చూపి గోడు వెళ్లబోసుకుంది. కూలీ ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకున్న మూడెకరాల పొలంలో ఎకరాలో టమోటా, రెండెకరాల్లో చెరకు వేశానని తెలిపింది. ఎకరా టమోటా పంటకు రూ.70వేలు ఖర్చయితే రూ. 10వేలు రాబడి వచ్చిందని కన్నీటిపర్యంతమైంది. కిలో 6రూపాయలు పలుకుతోందని, కూలీ ఖర్చులు కూడా రాకపోవడంతో పంటను చేలోనే వదిలివేశానని తెలిపింది. గత ఏడాది రెండెకరాల్లో మిర్చి పంటవేస్తే 2.5 లక్షల రూపాయల పెట్టుబడి అయిందని, వాగువచ్చి పంట కొట్టుకుపోతే ప్రభుత్వం ఒక్కరూపాయి పరిహారం కూడా ఇవ్వలేదని మహిళా రైతు వాపోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగితే రూ.70 వేల పంటల బీమా సొమ్ము వచ్చిందని పేర్కొంది. ఏటికేడు నష్టాలతో అప్పులు పెరిగిపోతున్నాయే తప్ప లాభం లేదంది. ప్రభుత్వం సాయం అందించకపోతే వ్యవసాయం చేయడం కష్టమని తెలిపింది.

**దీనిపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ...** టమోటా రైతులను ఆదుకోవడానికి కెచప్ ఫ్యాక్టరీలు పెడతానన్న జగన్ పత్తా లేకుండా పోయారని లోకేష్ విమర్శించారు. పంటలబీమాకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీ పెడుతుందని చెప్పి అన్నదాతలను నట్టేట ముంచారని, రైతులు పంటలు నష్టపోతే కనీసం పరిశీలించి అంచనావేసే నాథుడే లేదని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెటింగ్, నిల్వ సౌకర్యం కల్పించి టమోటా రైతులను ఆదుకుంటామని, పంట పెట్టుబడులను తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని లోకేష్ పేర్కొన్నారు.

# శ్రీవారి ఆలయంపై హెలికాప్టర్లు ఎందుకు తిరిగాయో చెప్పిన టీటీడీ ఛైర్మన్



తిరుపతి: తిరుమల ఆలయంపై హెలిక్టాఫర్లు చెక్కర్లు కొట్టడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. తిరుమల ఆలయంపై చెకర్లు కొట్టిన హెలికాప్టర్లు మిలిటరీదని తెలిసిందన్నారు. దేశ భద్రత విషయంలో మనం జోక్యం చేసుకోలేమని చెప్పారు. గురువారం ఉదయం టీటీడీ ఉద్యోగుల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను టీటీడీ ఛైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సులభ కార్మికులు ఆకస్మికంగా విధులు బహిష్కరించి భక్తులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మొదట విధులకు హాజరై ఆ తర్వాత వారి డిమాండ్లు అడిగితే తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నకిలీ వెబ్సైట్‌లు, బ్లాక్‌లో దర్శనం టికెట్లకు కారణం అవుతున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు త్వరలో ఇళ్ల స్థలాలు మంజూరు పూర్తిచేస్తామని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 25న తిరుమల కొండపై మూడు హెలికాప్టర్లు చెక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే.

# నటి కాకపోతే జాన్వీ సంచార జీవితం!

అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా తెరంగేట్రం చేసిన జాన్వీకపూర్ కెరీర్ బాలీవుడ్ లో దేదీప్యమానంగా సాగిపోతుంది. యువ హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా రాణిస్తుంది. బయోపిక్ ల్లో సైతం నటిస్తూ సత్తా చాటుతుంది. ఇటీవలే టాలీవుడ్ లో నూ లాంచ్ అయింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమా తో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. నిజ జీవితంలో జాన్వీ ఊహించిందే. తల్లి అగ్ర తారగా కొనసాగారు. తండ్రి పెద్ద నిర్మాత. అలాంటి బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చే వారసులు తప్పకుండా నటులే అవుతారని ఎవరైనా ఊహిస్తారు. దాదాపు అలాంటి వారి అందరి జీవితాలు తాము కొరుకున్న విధంగానే ఉంటాయి. అయితే ఒకవేళ జాన్వీ నటికాకపోతే మరో ఆప్షన్ ఏదైనా పెట్టుకుందా? అంటే అవుననే అంటుంది. జాన్వీ నటికాకపోతే ప్రపంచమంతా సంచారిలో చుట్టేసిదిట. సంచార జీవితం అంటే ఎంతో ఇష్టమట. నటి కాకపోతే ప్రపంచం చుట్టేసి కొత్త



వ్యక్తుల్ని కలుసుకునే దాన్ని. అదీ కుదరకపోతే రచయిత్రి అయ్యే దాన్ని అని తెలిపింది. సంచార జీవితం అన్నది సాహసంతో కూడుకున్నది. ప్రపంచాన్ని సాధారణంగా చుట్టేయడం వేరు. అడ్వెంచర్స్ గా మలుచుకోవడం వేరు. ఇక్కడ కూడా జాన్వీ అడ్వెంచర్ గానే ప్రయాణం సాగించడాన్ని ఇష్టపడింది. ఎక్కువగా ప్రకృతితో గడపాలని ఇష్టపడుతుందిట. వాయు కాలుష్యానికి దూరంగా చుట్టూ పచ్చిన వాతావరణ ఉంటే ఎంతో ఇష్టమట. అందుకోసం ఎక్కువగా మాల్దీవులకు వెళ్తుందిట. అలాగే ప్రశాంతత కోసం మూడు నెలలకు ఒకసారైనా తిరుపతి శ్రీవారి దర్శనం చేసుకుంటుందిట. మొత్తానికి అమ్మడిలో కొన్ని మంచి క్వాలిటీలు ఉన్నాయని తెలుస్తోంది. ఇలా ప్రపంచాన్ని చుట్టేయడం అంటే డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ కి ఎంతో ఇష్టం. ఖాళీగా ఉంటే బ్యాగేసుకుని ప్రపంచ దేశాలన్ని చుట్టడం ఆయనకు అలవాటు. ఆ అలవాటు నుంచి పుట్టిందే హార్ట్ ఎటాక్ లో నితిన్ క్యారెక్టర్. ఆ సినిమా ప్రచార సమయంలోనే పూరికి ప్రపంచ యాత్ర చేయాలని ఉందన్న విషయాన్ని రివీల్ చేసారు. కొత్త అన్వేషణలు అంటే ఆయనకు ఎంతో ఇష్టం.

# రెండు బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టి ఫోటోలకి పరిమితమైన హీరోయిన్..!

కన్నడ సెన్సేషనల్ మూవీ కె.జి.ఎఫ్ తో వెండితెరకు పరిచయమైంది శ్రీనిధి శెట్టి. మొదటి సినిమానే హిస్టరీ క్రియేట్ చేసింది. ఆ తర్వాత ఆ సినిమా సీక్వెల్ లో కూడా అమ్మడు భాగమైంది. కె.జి.ఎఫ్ 1 2 సినిమాల హిట్లకు తను కూడా భాగమైంది. అయితే అంత పెద్ద హిట్లు కొట్టిన శ్రీనిధి కెరీర్ లో ఆ దూకుడు చూపించట్లేదని చెప్పొచ్చు. కె.జి.ఎఫ్ 2 తర్వాత విక్రం తో కోబ్రా సినిమా చేసింది శ్రీనిధి కానీ ఆ సినిమా రిజల్ట్ తేడా కొట్టడంతో అమ్మడు సైలెంట్ అయ్యింది. ఎంట్రీ గ్రాండ్ గా ఇచ్చినా తర్వాత సినిమాల విషయంలో కన్ ఫ్యూజ్ అవుతుంది శ్రీనిధి. అంతేకాదు తన దగ్గరకు వచ్చిన నిర్మాతలకు రెమ్యునరేషన్ పరంగా కూడా ఎక్కువ అడిగి షాక్ ఇస్తుందట. శ్రీనిధి ఇదంతా తెలిసి చేస్తుందా లేక తెలియక చేస్తుందా అన్నది చెప్పడం



కష్టం. సినిమాలు చేయకుండా ఫోటో షూట్స్ తో కాలం వెళ్లదీస్తుంది అమ్మడు. కె.జి.ఎఫ్ లాంటి సినిమా చేసిన హీరోయిన్ వరుసగా ఐదారు సినిమాలతో బిజీగా ఉంటుందని అనుకుంటే ఇలా ఖాళీగా ఉంటూ ఫోటోలు షేర్ చేస్తుంది. కెరీర్ గైడెన్స్ లో ఆమెకు ఎవరు సపోర్ట్ గా నిలవట్లేదా ఏంటో కానీ శ్రీనిధి క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలని తెలియట్లేదు. తెలుగులో ఒకటి రెండు సినిమాల డిస్కషన్స్ జరిగినా అమ్మడికి నచ్చలేదో లేక ఏమైందో కానీ ఆ అవకాశాలను మిస్ చేసుకుందట. కోబ్రా తర్వాత శ్రీనిధి మరే సినిమాకు సైన్ చేయలేదు. అయితే ఆడియన్స్ కు మాత్రం తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది. సినిమాలు చేయాలి కానీ ఇలా ఫోటో షూట్స్ ఎంత చేసినా ఏం లాభమని కొందరు అంటున్నారు. జీరో సైజ్ పర్ఫెక్ట్ అవుట్ ఫిట్ తో కుర్రాళ్ల హృదయాలను గాయం చేస్తున్న శ్రీనిధి వరుస సినిమాలు చేస్తే ఎంకరేజ్ చేసేందుకు ప్రేక్షకులు రెడీగా ఉన్నారు. సినిమాల విషయంలో అమ్మడు సీరియస్ గా ఉంటే బెటర్ ఇలా సైలెంట్ గా ఉంటే ఫేడవుట్ అయ్యే ఛాన్స్ కూడా ఉంటుంది.




# టిల్లుతో మెగాస్టార్ కిరికిరి.. అట్లుంటది మరి!!







సినిమా రంగం అనగానే ఒక హీరోతో మరో హీరో పోటీపడటం సర్వ సాధారణం. ముఖ్యంగా సినిమా విడుదల సమయంలో ఒకే రోజు డేట్ ఫిక్స్ చేసుకొని చాలా మంది హీరోలు తలపడుతూ ఉంటారు. సంక్రాంతి దసరా దీపావళి ఇలాంటి పండగ సమయంలో పోటీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే పండగ సమయంలో ప్రేక్షులు హాలీడేలో ఉంటారు కాబట్టి తమ సినిమాకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని కాసుల వర్షం కురుస్తుందని నమ్ముతుంటారు. ఇప్పటి వరకు పెద్ద పెద్ద హీరోలు కూడా అలా పోటీపడ్డారు. లేదంటే ఎవరైనా పెద్ద హీరో సినిమా ఉందంటే చిన్న హీరోలు మాకెందుకులే అని కాస్త ఆగుతారు. కానీ తాజాగా టాలీవుడ్ లో ఇంట్రస్టింగ్ ఫైట్ త్వరలో ఉండబోతోంది. అది మెగాస్టార్ చిరంజీవితో యువ హీరో సిద్ధు జొన్నలగొట్ట తలపడబోతున్నాడు. అసలు విషయానికి వస్తే చాలా కాలం తర్వాత మెగాస్టార్ ఖాతాలో వాల్తేరు వీరయ్యతో హిట్ పడింది. నిజానికి ఆ సినిమా కూడా కొత్త కథేమీ కాదు. కానీ చిరంజీవిని బాబీ చూపించిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. చిరు ఖాతాలో హిట్ పడింది. అందులోనూ పండుగ సీజన్ కావడంతో కాసుల వర్షం కూడా బాగానే కురిసింది. ఇప్పుడు ఆయన భోళా శంకర్ సినిమాతో రావడానికి రెడీ అవుతున్నాయి. ఇది 2015లో విడుదలైన తమిళ చిత్రం వేదాళం మూవీకి రీమేక్. ఈ చిత్రానికి మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది ఆగస్ట్ 11న విడుదల అవ్వడానికి రెడీగా ఉంది. నిజానికి మెగాస్టార్ సినిమా ఉంది అంటే ఆ దరిదాపుల్లో సినిమా విడుదల చేయడానికి ఇతర హీరోలు ఎవరూ డేర్ చేయరు. ముఖ్యంగా చిన్న హీరోలు ఆ ధైర్యం అస్సలు చేయరు. కానీ మెగాస్టార్ తో తలపడటానికి డిజే టిల్లు హీరో సిద్దు జొన్నలగడ్డ రెడీ అవుతున్నాడు. ఇటీవల డీజే టిల్లుతో హిట్ కొట్టి సెన్సేషన్ అయిన ఈ యువ హీరో. ఆ సినిమాలో సిద్ధు డైలాగులు కామెడీ టైమింగ్ కి యూత్ ఫిదా అయిపోయారు. కాగా ఇప్పుడు దానికి సీక్వెల్ గా టిల్లు స్క్వేర్ తెరకెక్కిస్తున్నాడు. ఆ సినిమా కూడా ఆగస్టు11నే విడుదల చేయాలని ఆ మూవీ టీమ్ భావిస్తోందట. అయితే మెగాస్టార్ తో పోటీ అవసరమా అని కొందరు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ తన సినిమా మీద ఉన్న నమ్మకంతో చిరుతో పోటీకి రెడీ అవుతున్నాడు. నిజం చెప్పాలంటే భోళా శంకర్ కన్నా టిల్లు స్క్వేర్ కే క్రేజ్ ఎక్కువగా ఉంది. మెగాస్టార్ స్టార్ డమ్ తప్ప భోళా శంకర్ కి పెద్దగా ప్లస్ పాయింట్స్ ఏమీ లేవు. వేదాళం మూవీ కూడా చాలా వరకు సినీ ప్రేక్షకులు చూసే ఉంటారు. కాబట్టి పెద్దగా క్రేజ్ లేదనే చెప్పాలి. కానీ టిల్లూ స్క్వేర్ అలా కాదు. దాని రీమేక్ కోసం ఫ్యాన్స్ తో సంబంధం లేకుండా పిల్లలు పెద్దలు అందరూ దానిని చూడటానికి ఎదురు చూస్తున్నారు. ఇక భోళా శంకర్ లో చిరంజీవి చెల్లిగా కీర్తి సురేష్ నటిస్తుంటే టిల్లూ లో అనుపమ పమేశ్వర్ హీరోయిన్ గా నటిస్తోంది. మరి ఈ బాక్సాఫీస్ క్లాష్ లో విజయం ఎవరికి దక్కుందో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.

# క్రేజీ హీరోయిన్ చేతలు మీదుగా.. రామబాణం మరో లవ్లీ సాంగ్



చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమాతో మన ముందుకు రావడానికి సిద్ధమయ్యారు హీరో గోపీచంద్. హీరోయిజం పండించాలన్నా విలనిజం చూపించాలన్నా ఆయను ఆయనే సాటి. ప్రస్తుతం ఆయన నటించిన రామ బాణం సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాకి శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి రెండు లిరికల్ సాంగ్స్ విడుదల కాగా తాజాగా మూడో లిరికల్ సాంగ్ విడుదల చేశారు. ఈ పాటను క్రేజీ హీరోయిన్ శ్రీలీల విడుదల చేయడం విశేషం. ఈ సినిమాకి జనాల్లో తీసకువెళ్లే భాగంలో ప్రమోషన్స్ పై గట్టిగా ఫోకస్ పెట్టారు. ఇప్పటికే మొదటి రెండు పాటలకు ట్రైలర్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మూడో పాటను శ్రీలల విడుదల చేశారు. హీరోయిన్ ని చూస్తూ మైమరిచిపోయి హీరో పాడే పాట ఇది. నువ్వేనా నువ్వేనా అంటూ సాగే పాట వినడానికి చాలా శ్రావ్యంగా ఉంది. శ్రోతలను కట్టిపడేసేలా ఉన్న ఈ పాట ఇప్పటికే ఆకట్టుకోవడం మొదలుపెట్టింది. తాను ఎంతో ఆరాధించే అమ్మాయి అందాన్ని పొగుడుతూ సాగే పాట. ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించారు. ఈ సినిమాకి మ్యూజిక్ మిక్కీజే మేయర్ అందించారు. పాటతో పాటు విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ పాటకు దినేష్ కుమార్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాలో గోపీచంద్ సరసన డింపుల్ హయతి నటించారు. కాగా పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపైట్క టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. వివేక్ కూచిభోట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. భారీ బడ్జెట్ తో ఈ సినిమాను తెరకెక్కించారు.

ఈ సినిమాలో గోపీచంద్ చాలా భిన్నమైన పాత్రలో కనిపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సినిమాకి భూపతి రాజా కథను అందించగా వెట్రి పళని స్వామి సినిమాటో గ్రఫీ మధుసూదన్ పడమటి డైలాగ్స్ అందించారు. డైలాగ్స్ చాలా పవర్ ఫుల్ గా ఉండనున్నాయని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో జగపతిబాబు ఖుష్బూ రాజా రవీంద్ర వెన్నెల కిషోర్ సప్తగిరి అలీ రాజా రవీంద్ర వెన్నెల కిషోర్ సప్తగిరి కాశీ విశ్వనాథ్ సత్య గెటప్ శ్రీనుసచిన్ ఖేడేకర్ నాజర్ తరుణ్ అరోనా సమీర్ వంటి ప్రముఖులు నటించారు. ఈ సినిమా మే 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాపై గోపీచంద్ చాలా ఆశలు పెట్టుకున్నారు. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఎంత వరకు మెప్పిస్తుందో చూడాలి.

# ఎంట్రీకి ముందే పర్ఫెక్ట్ ప్లాన్.. సంయుక్త స్కెచ్ అదుర్స్..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో సూపర్ ఫాం లో ఉంది. తన సినిమా ఎంట్రీ అంతా అలా జరిగిపోయిందని తన ఫేస్ బుక్ ఫోటోని చూసి ఒక డైరెక్టర్ కు ఒక కెమెరా మెన్ రిఫర్ చేయగా ఆడిషన్ కు పిలిచి సినిమా ఛాన్స్ ఇచ్చారని అన్నది. అంతేకాదు ఒక సినిమా చేసి సినిమాలు ఆపేద్దామనుకున్నా కానీ ఇక్కడ ప్రేక్షకుల ఆదరణ చూసి వరుసగా చేస్తూ వస్తున్నా అన్నది సం యుక్త. భీమ్లా నాయక్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు ఆ సినిమా ఆఫర్ రాగానే ట్యూటర్ ని పెట్టుకుని మరీ తెలుగు నేర్చుకున్నానని అన్నది. భీమ్లా నాయక్ ఈవెంట్ లో తెలుగు లో మాట్లాడటం చూసిన పవన్ కళ్యాణ్ చాలా బాగా మాట్లాడారని చెప్పారు. ఇక భీమ్లా నాయక్



సినిమా తర్వాత తనని అందరు డ్యానియల్ భార్య అని పిలుస్తున్నారని. పవన్ కళ్యాణ్ సిస్టర్ అంటున్నారని చెప్పుకొచ్చింది. తనకు ట్రావెలింగ్ చాలా ఇష్టమని ఒక్కదాన్నే ఎక్కడికైనా వెళ్తుంటానని అన్నది. హిమాలయాలకు వెళ్లొచ్చానని చెప్పింది సంయుక్త. అమ్మ నాన్న చిన్నప్పుడే విడిపోవడం వల్ల తన మదర్ దగ్గరే తను పెరిగానని. అందుకే తన తండ్రి ఇంటి పేరు మీనన్ ను ఇక మీదట వాడకూడదని అనుకున్నానని అన్నారు. ఇక హీరోయిన్ గా సెటిల్ అవకపోతే ట్రావెలర్ గా కెరీర్ ఎంచుకునే దాన్ని అని చెప్పింది అమ్మడు. అంతేకాదు ట్రావెలింగ్ అంటే ఇష్టం ఉండటం వల్ల తన వీపు మీద ట్రావెలర్ అనే ట్యాటూ కూడా వేయించుకున్నా అన్నది. కాలేజ్ డేస్ లో ధనుష్ ఆడుకాలం సాంగ్ కు ఫ్రెండ్స్ తో కలిసి డ్యాన్స్ చేశా ఇప్పుడు అదే ధనుష్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నా ఇది నిజంగా తను ఊహించలేదని అని చెప్పారు సంయుక్త. తెలుగులో మంచి ఫాం లో ఉన్న అమ్మడు తన ప్రతి సినిమాతో హిట్ అందుకోవడంతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. సంయుక్త ఉంటే సినిమా హిట్ అన్న క్రేజ్ రావడంతో ఆమెతో సినిమాకు దర్శక నిర్మాతలు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం మరో రెండు సినిమాలకు సైన్ చేసిన సంయుక్త తన లక్కీ ఫాం కొనసాగిస్తుందని చెప్పొచ్చు. సంయుక్త ను తెలుగు తెరకు పరిచయం చేసిన సితార బ్యానర్ లోనే మరో సినిమా కూడా ఆమె చేస్తుందని తెలుస్తుంది.

# అనసూయ వెబ్ సీరీస్ ఒక్క అడుగైనా పడిందా..?

జబర్దస్త్ యాంకర్ అనసూయ ప్రముఖ దర్శకుడు క్రిష్ డైరెక్షన్ లో ఒక మెగా వెబ్ సీరీస్ ప్లాన్ చేశారని తెలిసిందే. జబర్దస్త్ చేస్తూనే అడపాదడపా సినిమాలు చేస్తూ వచ్చిన అను సినిమాల్లో బిజీ అవడం వల్ల జబర్దస్త్ కు గుడ్ బై చెప్పేసింది. అయితే అనసూయ జబర్దస్త్ కు బై బై చెప్పడానికి వెనుక రీజన్ క్రిష్ తో చేసే వెబ్ సీరీస్ అని టాక్ వచ్చింది. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నవల ఆధారంగా ఈ వెబ్ సీరీస్ రాబోతుంది. వెబ్ సీరీస్ గురించి సోషల్ మీడియా లీకులు తప్ప అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ అయితే రాలేదు. ఈ వెబ్ సీరీస్ లో అనసూయ వేశ్య పాత్రలో నటించనుంది. సోషల్ మీడియా హడావిడే తప్ప ఈ వెబ్ సీరీస్ ఇప్పటివరకు సెట్స్ మీదకు వెళ్లింది లేదు. అనసూయ కూడా సినిమా ఆఫర్లు వస్తున్నాయి కదా అని రెగ్యులర్ గా వచ్చే జబర్దస్త్ పేమెంట్ ని వదిలేసుకుంది.



అనసూయతో క్రిష్ వెబ్ సీరీస్ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అనసూయ మాత్రం రంగస్థలం పుష్ప లాంటి సినిమాల్లో ప్రత్యేక పాత్రలో నటిస్తూ వస్తుంది. బుల్లితెర మీద హాట్ ఇమేజ్ తెచ్చుకున్న అనసూయ వేశ్య పాత్రలో నటిస్తుందని అనగానే ఆడియన్స్ లో ఆసక్తి మొదలైంది. ఈ వెబ్ సీరీస్ మొదలవ్వాలి అంటే పవన్ తో క్రిష్ చేస్తున్న వీరమల్లు సినిమా పూర్తి కావాలి. రెండేళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు పవన్ డేట్స్ అడ్జస్ట్ అవకపోవడం తో ఇప్పటికీ పూర్తి కాలేదు. పవన్ దీనితో పాటుగా మిగతా సినిమాలు కూడా చేస్తుండటం వల్ల వీరమల్లు సినిమా ఇంకా పెండింగ్ ఉంది. క్రిష్ పవన్ సినిమా పూర్తి చేసి అది రిలీజ్ అయ్యాకనే అనసూయ వెబ్ సీరీస్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది. అప్పటివరకు అనసూయ ఎదురుచూడక తప్పదు. అనసూయ కన్యాశుల్కం వెబ్ సీరీస్ పై ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ ఏర్పడింది. ప్రముఖ ఓటీటీ సంస్థ ఈ వెబ్ సీరీస్ ను ప్లాన్ చేస్తున్నారు. ఈ వెబ్ సీరీస్ కోసం అనసూయ భారీ రెమ్యునరేషన్ అందుకుంటుందని తెలుస్తుంది.



# తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబురాలు

## పార్టీ జెండా ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ : తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ సంబురాలు జరుగుతున్నాయి. తెలంగాణ భవన్ చేరుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంట ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరారవు, సంతోష్ కుమార్, మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మధుసూదనా చారి, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ జరుగుతున్నది. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, జడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పార్టీ అధ్యక్షులు మొత్తం 279 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలపై చర్చించి ఆమోదించనున్నారు. భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.




హైదరాబాద్: అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో ముందుకెళ్తున్నామని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. దేశాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు ముందుకు సాగుతున్నామని తెలిపారు. భారాస ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడం, ప్రజలతో కమ్యూనికేషన్స్ పెంచుకోవడం, నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యాచరణను చేపట్టాలని వారికి సూచించారు. భారాస అధికారంలోకి రావడమనేది పెద్ద టాస్క్ కాదని.. మునపటి కన్నా ఎక్కువ సీట్లు సాధించడమే ప్రాధాన్యతాంశమని శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

**కేసీఆర్ ప్రసంగంలోని ప్రధానాంశాలు..** అకాలవర్షాలు రాకముందే పంట కోతలు పూర్తయ్యేలా వ్యవసాయశాఖ రైతులను చైతన్యం చేయాలి. మక్కలు, జొన్నలు అన్ని పంటలు కూడా గతంలో మాదిరి కొంటాం. మార్క్ ఫెడ్‌కు ఈ మేరకు ఆదేశాలిస్తాం. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉన్నాయి. వాటి సర్వే నంబర్లేసి నా కార్యాలయంలో అప్పగించండి. ఇళ్లు కట్టుకోవటానికి యోగ్యంగా వుంటే వాటిని తక్షణం పంచేద్దాం. మన రాష్ట్రంలోని పథకాలు అమలు చేస్తే దివాలా తీస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం అంటుంది. కానీ, తెలంగాణ ఎందుకు దివాలా తీస్తలేదు? మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో 63, రెండో అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు గెలిచాం.

వచ్చే ఎన్నికల్లో 100కు పైగా గెలుస్తాం. నియోజకవర్గం వారీగా ప్రభుత్వం నుంచి కూడా ఇద్దరు నాయకులు బాధ్యతలు తీసుకోవాలి. పల్లె నిద్ర వంటి కార్యక్రమాలతో జనంతో మమేకం కావాలి.క్యాడర్‌లో అసంతృప్తిని తగ్గించే చర్యలు చేపట్టండి. మన ప్రభుత్వం అధికారంలోకి రావడమనేది పెద్ద టాస్క్ కాదు. మునపటి కన్నా ఎక్కువ సీట్లు రావాలి అనేది ప్రాధాన్యతాంశం.

**భారాస తీర్మానాలివే..** దేశంలో రైతు రాజ్యం స్థాపించాలి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక భారీ నీటి ప్రాజెక్టు నిర్మించాలి. 24గంటల పాటు దేశ వ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే కొత్త పాలసీ అమలు చేయాలి. మన దేశ బ్రాండ్‌తో విదేశాలకు ఫుడ్ ప్రొడక్ట్‌లు ఎగుమతి చేయాలి. దళిత బంధు దేశ వ్యాప్తంగా అమలు చేయాలని తీర్మానం. దేశంలో భారీ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని తీర్మానం. దేశంలో బీసీ జనగణన జరపాలని తీర్మానం. ద్వేషాన్ని విడిచి.. ప్రశాంతతకు దేశ పౌరులంతా ఏకం కావాలని తీర్మానం.

## పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కేటీఆర్





హైదరాబాద్: నాటి నుంచి నేటి వరకు భారత రాష్ట్ర సమితికి అండగా ఉంటున్న పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న బీఆర్ఎస్.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని పునఃప్రతిష్టించిందని చెప్పారు. అనతికాలంలోనే సీఎం కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని వెల్లడించారు. 22 ఏండ్లుగా పార్టీ ప్రస్థానంలో అండగా ఉన్న అందరికి ధన్యవాదాలు తెలిపారు. 'రెండు దశాబ్దాల క్రితం ఉద్యమపార్టీకి పురుడు పోసి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని పునఃప్రతిష్టించి, అనతికాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన నేత మన కేసీఆర్. 22 ఏండ్ల ప్రస్థానంలో నాటి నుంచి నేటి వరకు భారత రాష్ట్ర సమితికి అండగా ఉంటున్న పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు.

## పార్టీ నేతలపై వీహెచ్ కీలక వ్యాఖ్యలు.. 'బలగం' సినిమాను ప్రస్తావిస్తూ...

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో ఎవరిష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారని మాజీ పీసీసీ చీఫ్ వి.హనుమంతరావు వ్యాఖ్యలు చేశారు. గురువారం గాంధీభవన్‌లో జరుగుతున్న సత్యాగ్రహ దీక్షలో వీహెచ్ పాల్గొని ప్రసంగించారు. పార్టీలో అందరూ బలగం సినిమా తరహాలో కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. నరేంద్ర మోదీ వచ్చిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఉందా.. లేదా అనిపిస్తుందన్నారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామన్నారని.. ఎన్నో చెప్పారు కానీ ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ ఇవ్వలేదన్నారు. రైతులను కూడా మోదీ మోసం చేశారని విమర్శించారు. మోదీ వచ్చాక పబ్లిక్ సెక్టార్లను ప్రైవేట్‌పరం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాహుల్ గాంధీని పార్లమెంట్ నుంచి అనర్హత వేటు వేసి, ఇల్లు ఖాళీ చేయించడం అంటే ఇంతకంటే దుర్మార్గం ఉండదన్నారు. బండి సంజయ్ నిరుద్యోగ యువత కోసం పోరాటం అంటున్నారని.. తమరు ఇస్తామన్నా రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తానని కేసీఆర్ అన్నారని.. ఉద్యోగాలు ఏమయ్యాయి కేసీఆర్ అని నిలదీశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ వచ్చిందన్నారు. బీసీలకు సమయం ఆసన్నమైందని తెలిపారు. రాహుల్ గాంధీకి అండగా అంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## రివాల్వర్‌తో కాల్చుకొని.. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



బేగంపేట: సికింద్రాబాద్ పరిధిలోని బేగంపేటలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ దేవేందర్ ఆత్మహత్య చేసుకున్నారు. బేగంపేటలోని చికోటి గార్డెన్ వద్ద సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని గురువారం తెల్లవారుజామును బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవేందర్‌గా గుర్తించారు. సీఆర్‌పీఎఫ్ ఐజీ మహేశ్‌చంద్ర వద్ద ఆయన విధులు నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్ ఆత్మహత్యకు ప్రేమ వ్యవహామే కారణమని బేగంపేట పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జవాను మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## ఈడీపై కవిత పిటిషన్.. ధర్మాసనానికి మెన్షన్ చేసిన కపిల్ సిబల్...

ఢిల్లీ : ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను త్వరగా విచారణ చేపట్టాలని జస్టిస్ రస్తోగి ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మెన్షన్ చేశారు. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ చేయొచ్చా అనే అంశాన్ని సవాల్ చేస్తూ గతంలో కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వచ్చే సోమవారం కవిత పిటిషన్ విచారించాలని ధర్మాసనానికి కపిల్ సిబల్ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థనను పరిశీలిస్తామని జస్టిస్ రస్తోగి ధర్మాసనం తెలిపింది. ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో గత నెలలో విచారణ జరిగింది. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూడు వారాల పాటు వాయిదా వేసింది. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో గతంలో దాఖలు చేసిన నళినీ చిదంబరం పిటిషన్‌కు సుప్రీంకోర్టు ట్యాగ్ చేసింది. కవిత తన పిటిషన్‌లో సరికొత్త అభ్యర్థన చేశారు. మద్యం పాలసీ కేసు విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌధురి కవిత తరఫున వాదనలు వినిపించారు. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఈడీ కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ తనకు పీఎంఎల్‌ఏ చట్టంలోని సెక్షన్ 50 ప్రకారం జారీచేసిన నోటీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 160కి విరుద్ధంగా ఉన్నాయని, వాంగ్మూలం నమోదు చేసేప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కవిత ఆ పిటిషన్‌లో కోరారు. తన ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, జారీ చేసిన జప్తు నోటీసులను రద్దు చేయడంతో పాటు.. ఫోన్‌ను సీజ్ చేయడం చెల్లదని ఆదేశాలు ఇవ్వాలని, ఈ పిటిషన్‌ను నళినీ చిదంబరం వర్సెస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు జత చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తొలుత శుక్రవారం విచారణ జరుపుతామని చెప్పినా.. ఆ తర్వాత తదుపరి విచారణ తేదీని 27గా ప్రకటించింది. కాగా.. కవిత ఇప్పటికే ఈడీ ఎదుట మూడుసార్లు హాజరై.. తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. సాక్షిగా పిలిచిన మహిళను తమ ఇంటి వద్ద లేదా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని పిటిషన్‌లో కవిత కోరారు. సీఆర్పీసీ సెక్షన్ 160ని ఉల్లఘించి... తనని ఈడీ కార్యాలయానికి పిలిచి విచారిస్తున్నారని కవిత పేర్కొన్నారు. విచారణ సందర్భంగా... ఈడీ అధికారులు మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. గతంలో పలు ఉదాహరణలు ఉన్నాయని కవిత తెలిపారు. ఈడీ అధికారులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసిందని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈడీ అధికారులు కొంత మంది నిందితుల పట్ల ప్రవర్తించిన తీరు తనని ఆందోళనకు, భయానికి గురి చేస్తోందని తెలిపారు. న్యాయవాదుల సమక్షంలో, సీసీ టీవీ కెమెరాల నిఘాల్లోనే విచారణ చేపట్టేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.




## మాల్‌ప్రాక్టీస్ కేసు.. బండి సంజయ్ బెయిల్ రద్దు పిటిషన్ కొట్టివేత

హనుమకొండ: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఊరట లభించింది. తనకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను హనుమకొండ జిల్లా కోర్టు కొట్టివేసింది. పదో తరగతి ప్రశ్నపత్రం మాల్‌ప్రాక్టీస్ కేసులో బండి సంజయ్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

సంజయ్‌కు ఏప్రిల్ 6న బెయిల్ మంజూరైంది. అయితే, సంజయ్ బెయిల్ షరతులు ఉల్లంఘిస్తున్నారని, ఆయనకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ పోలీసులు ఈనెల 17న పిటిషన్ దాఖలు చేశారు. హనుమకొండ జిల్లా నాలుగో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మట్ట సరిత ఇరుపక్షాల వాదనలను మంగళవారం విన్నారు. తదుపరి వాదనల కోసం కేసును బుధవారానికి వాయిదా వేశారు.

బుధవారం ఇరువర్గాల నుంచి ఎలాంటి వాదనలు లేకపోవడంతో తీర్పు వెల్లడిని గురువారానికి వాయిదా వేశారు. బెయిల్ రద్దుకు సహేతుక కారణాలు లేవని సంజయ్ తరఫు న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపించారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం పోలీసుల పిటిషన్‌ను కొట్టివేసింది.




దంతెవాడ: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు మాటువేసి.. మందుపాతర పేల్చి 10 మంది జవాన్లను బలి తీసుకున్న ఘటన తీవ్రంగా కలచివేసింది. గురువారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ మృతులకు నివాళి అర్పించారు. ఆ సందర్భంగా సీఎం ఓ శవపేటికను మోశారు. జవాన్ల మృతదేహాలను ఓ వాహనంలో వారి స్వస్థలాలకు తరలిస్తున్నారు. ఆ వాహనం వరకు ఆయన దానిని తీసుకెళ్లారు. ఈ సమయంలో జవాన్ల కుటుంబ సభ్యుల వేదన చూపరులను కంటతడిపెట్టించింది. వారిని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. పిల్లలు, కుటుంబసభ్యుల రోదనలు ఒకపక్క.. 'భారత్ మాతాకీ జై' నినాదాలు మరోపక్క వినిపిస్తుండగా.. ఆ శవపేటికలను స్వస్థలాలకు తరలించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'జవాన్ల త్యాగాలు వృథాగా పోవు. మావోయిస్టులను మట్టుపెట్టేందుకు జరుపుతోన్న పోరును మరింత తీవ్రం చేస్తాం'అని వెల్లడించారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా బుధవారం ఉదయం డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డు (డీఆర్జీ) జవాన్లు కూంబింగ్ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వారు మినీ బస్సులో తిరుగు పయనమయ్యారు. వారిపై దాడి చేసేందుకు అరన్‌పుర్-సమేలీ మధ్యలో ప్రధాన రహదారికి సమీపంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు మాటు వేశారు.

భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకోగానే రోడ్డు మధ్యలో అమర్చిన ఐఈడీ బాంబులను పేల్చారు. ఈ పేలుడు దాటికి మినీ బస్సు తునాతునకలైంది. రోడ్డుపై పది అడుగుల లోతు గొయ్యి పడింది. బస్సులోని 10 మంది డీఆర్జీ జవాన్లు అక్కడికక్కడే అసువులు బాశారు. డ్రైవరు తీవ్ర గాయాలతో మృతి చెందారు.

## మహేష్ దారుణ హత్య కేసులో నిందితుల అరెస్టు

మంచిర్యాల జిల్లా: ఇందారంలో మహేష్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అదే గ్రామానికి చెందిన కనకయ్యతో పాటు అతని భార్య పద్మ, కుమార్తెలు శృతి, శ్వేత, కుమారుడు సాయిలను అరెస్టు చేశారు. ఆ వివరాలను జైపూర్ ఏసీపీ నరేందర్ మీడియాకు వెల్లడించారు. శృతి –మహేష్ గతంలో ప్రేమించుకున్నారు. ఆ చనువుతో న్యూడ్ వీడియోలు షేర్ చేసుకున్నారు. న్యూడ్ వీడియోలను మహేష్ సోషల్ మీడియాలో పెట్టడంతో శృతి కుటుంబం అవమానంగా భావించింది. దీంతో ఎలాగైనా మహేష్‌ను చంపాలని కొద్ది రోజులుగా ప్లాన్ చేశారు. రెండు రోజుల క్రితం ఇంటి ముందు నుంచి వెళుతున్న మహేష్‌ను శృతి కుటుంబ సభ్యులు అడ్డగించి మూకుమ్మడిగా దాడి చేసి హత్యకు పాల్పడ్డారు. వివాహిత శృతిని వేధిస్తున్నాడనే హత్య జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పెళ్లికి ముందు యువతి, మహేష్ మధ్య ప్రేమ వ్యవహారం నడువగా.. విషయం తెలిసిన కుటుంబసభ్యులు యువతిని వేరొకరికి ఇచ్చి పెళ్లి చేశారు. ఇది జీర్ణించుకోలేని మహేష్.. యువతి భర్తకు తమ వీడియోలు, ఫొటోలు పంపించాడు. ఈ క్రమంలో అవమానభారంతో యువతి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ వల్లే యువతి భర్త ఆత్మహత్య చేసుకున్నాడని.. అతడిపై శృతి కుటుంబసభ్యులు కక్ష పెంచుకున్నారు. అదును చూసి మహేష్‌ను అత్యంత కిరాతకంగా హతమార్చారు. నడిరోడ్డుపై బండరాయితో కొట్టి చంపారు. అందరూ చూస్తుండగానే యువతి కుటుంబసభ్యులు ఈ దారుణానికి పాల్పడ్డారు. హత్యా దృశ్యాలను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. మహేష్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com